

క్యాప్‌లు తొడిగి.. పనికెళుతూ..


గిద్దలూరు-నంద్యాల రోడ్డులో


ఒంగోలులో చెవులకు కర్చీఫ్ కట్టి..


దుప్పటి చుట్టుకొని


మంచుతో తడిసిన పుష్పం


తలకు మంకీ క్యాప్ తొడిగి..


మంటతో చలికాచుకుంటూ..


గిద్దలూరు సమీపంలో వరి చేలో దమ్ము చేస్తూ..

మంచు కురిసే వేళలో..


మంచులో అందంగా కనిపిస్తున్న ఎస్ఎన్‌పాడు - చీమకుర్తి రహదారి

మహా మాంత్రికుడి బూర నుంచి మాయా
పొగ పొరలు పొరలుగా
కమ్ముకొస్తున్నట్టూ..
ఆ పొగ, చెట్టూ.. చేనూ.. కొండా..
కోనా..బండీ.. బస్సూ.. దాటుకొని
దూసుకొస్తున్నట్టూ..
వేకువజామున వాహనాల వెలుగు రేఖలు
దరిచేరకుండా వెండి రంగుల దడి
కడుతున్నట్టూ..
అప్పుడే నిద్రలేచి బయటికొస్తున్న
బాటసారుల తనువును సుకుమారంగా
తాకి తిమ్మిరి పెడుతున్నట్టూ..
కోడి కూయకముందు నుంచి
భానుడు బారెడు పొద్దుకు చేరే దాకా
కురుస్తున్న మంచు పలికించే భావాలివి.
దుప్పటి చుట్టుకుని పనిచేసే
శ్రామికులూ... తనువంతా తడితో
జాలువారే మంచు చుక్కలతో పులకించే
పువ్వులూ... తుఫానులో తడిసి నీటి
ధారలను వదులుతున్నట్టు కనిపించే
చెట్లూ... వారం రోజుల నుంచి
ఎటుచూసినా ఇలాంటి దృశ్యాలే జిల్లా
వ్యాప్తంగా కనువిందుచేస్తున్నాయి.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- కూరగాయల మార్కెట్‌కు కొత్త రూపు
- పరిసరాలు పరిశుభ్రం.. అంతా ప్రక్షాళన..
- ఇప్పటికే ఆరుబయట ఆక్రమణల తొలగింపు
- దుకాణాల్లో బినామీలు ఇక బయటకే..
- రూ.12కోట్ల బకాయిలపై సీరియస్‌గా దృష్టి
- వైసీపీ పాలనలో వ్యాపారులు, ఆర్ఐలు కుమ్మక్కు
- సమూల మార్పునకు చర్యలు చేపట్టిన అధికారులు

ఒంగోలు నగరం నడిబొడ్డున ఉన్న కొత్త కూరగాయల మార్కెట్ సరికొత్త రూపును సంతరించుకుంది. మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు కళ్లు తెరవడంతో మొత్తం ప్రక్షాళన జరుగుతోంది. మార్కెట్ ఎదుట, మధ్యలో ఆక్రమణలను తొలగించిన అధికారులు ఇప్పుడు అంతా బాగుచేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయల కొనుగోళ్లకు వెళ్లే జనం మార్కెట్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లకు అందంగా ముస్తాబైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే కార్పొరేషన్ అధికారులు ఆక్రమణల తొలగింపుతోనే సరిపెట్టకుండా దుకాణాల్లో తిష్టవేసి ఇతరులకు, వ్యాపారాలకు అద్దెకు ఇచ్చిన బినామీల ఏరివేత, పెండింగ్ ఉన్న రూ.12కోట్లు అద్దె బకాయిల వసూళ్లపై దృష్టి సారించారు.

అద్దె చెల్లించకుంటే చర్యలు

కూరగాయల మార్కెట్‌లోని పలు దుకాణ లీజుదారులు ఐదేళ్లుగా అద్దెలు చెల్లించడం లేదు. రూ.12 కోట్లు బకాయి ఉంది. కొన్ని షాపుల్లో వ్యాపారులు కాకుండా, ఇతరులు ఉన్నట్లు గుర్తించాం. వారికి నోటీసులిచ్చి ఖాళీ చేయిస్తాం. మార్కెట్ ఆవరణంలో దుకాణాలు పెట్టకూడదని చెప్పినా లెక్కచేయలేదు. ప్రతి ఒక్కరు బకాయిలు చెల్లించాల్సిందే. లేని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్టు కింద శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. -డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఓఎంసీ కమిషనర్


చుట్టూ ఉన్న ఆక్రమణల తొలగింపుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అన్నా క్యాంటీన్

ఆక్రమణల తొలగింపుతో విశాలంగా కనిపిస్తున్న కొత్త కూరగాయల మార్కెట్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఊరచెరువులో గల దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో ప్రక్షాళన మొదలైంది. గత కొన్నేళ్లుగా మార్కెట్‌లోని వ్యాపారుల ఇష్టారాజ్యం వ్యవహారానికి కార్పొరేషన్ అధికారులు చెక్ పెట్టే దిశగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే గడిచిన రెండు రోజుల క్రితం ఆరుబయట అమ్మకాలు నిషేధిస్తూ ఆక్రమణలు తొలగించారు. అయితే అధికారుల తీరును తప్పుబడుతూ వ్యాపారులు ఎదురుదాడికి దిగారు. అయినా వెనక్కు తగ్గని అధికారులు పూర్తిస్థాయిలో తొలగించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. గత రెండు రోజుల నుంచి సిబ్బంది పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టారు. దీంతో మార్కెట్‌ను చూసిన ప్రతిఒక్కరూ ఎన్నాళ్లకెన్నాళ్లకు అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో ఒక్కపైసా చెల్లించలేదు

2019 నుంచి కొవిడ్ సాకుగా చూపి అద్దెలు చెల్లించని దుకాణాలకు తాళాలు వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, పండ్లు, పూల దుకాణాల నుంచి సుమారు రూ.12కోట్లు అద్దెలు, పన్నులు వసూలు కావాల్సి ఉంది. అందులో హోల్‌సేల్ షాపుల నుంచే రూ.5.5కోట్లు రావాల్సి ఉండగా, మిగిలినవి రిటైల్ షాపుల నుంచి వసూలు కావాల్సి ఉంది. అయితే పలువురు వ్యాపారులు గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తమకు ఉన్న పలుకుబడితో అధికారులను లెక్కచేయలేదు. అద్దెలు చెల్లించకుండా ఏళ్లుగా తిష్టవేసి ఉండటంతో అధికారులు అద్దె బకాయిల వసూళ్లపై దృష్టిసారించారు. ఇకపై రాజీ పడేది

మిగతా 6లో...


ఒంగోలులో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి డోలా, మేయర్ సుజాత

వైసీపీ ప్రభుత్వంలో భారీగా భూ అక్రమాలు

- ఒక్కొక్కటిగా వెలుగులోకి..
- అక్రమార్కులను ప్రభుత్వం ఉపేక్షించదు
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పేర్కొన్నారు. స్థానిక గాంధీరోడ్డులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వాటికి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. అందులో భాగంగానే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూఅక్రమాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. భూ వ్యవహారాల్లో ఎంతటి వారు ఉన్నా ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి స్పష్టం చేశారు. గతంలో కరప్షన్‌కు కజిన్... జగన్ అని, నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్ష కోట్లు కొల్లగొట్టాడని ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల జగన్‌తో సహా వైసీపీ నేతలంతా తామేమి అవినీతికి అనర్హం కాదన్నట్లుగా అన్నింటిలోనూ దోపిడీకి పాల్పడ్డారన్నారు. వైసీపీ నేతల అవినీతిపై మీడియాలో వస్తుంది కొంతేనని, దీనిపై లోతైన దర్యాప్తు జరుపుతున్నామన్నారు. తమ

మిగతా 6లో...

పంచభూతములే ముఖపంచకమై..



ఒంగోలులోని పీవీఆర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. సృష్టిలోని పంచ భూతములైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశంల ప్రాధాన్యతపై ఓ పాఠశాల విద్యార్థినుల నృత్య రూపకం ఆహూతులను అలరించింది.

7

ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే..

- దేశంలో తొలిసారిగా వాట్సాప్‌తో సేవలు
- 161 రకాల పౌరసేవలు అందులోనే..
- 95523 00009 నెంబర్ కేటాయింపు



ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రజలకు సత్వర పౌరసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు చర్యలు తీసుకున్నారు. ఈ సేవలను ప్రజలు సత్వరం పొందేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అధికారిక వాట్సాప్ నెంబరు 95523 00009 నెంబర్‌ను ప్రకటించి లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలకు పౌరసేవలు అందివ్వడంతోపాటు ప్రజల నుంచి

మిగతా 6లో...

జీపీఎస్ పట్టించింది

- జూమ్ యాప్‌లో అద్దెకు..
- ఆపై అపహరణ
- కంటైనర్‌లో ఆ కార్లతో
- చెన్నైకు ప్రయాణం
- టెక్నాలజీతో గుర్తించిన పోలీసులు
- మూడు కార్లు, కంటైనర్ స్వాధీనం
- బిట్రగుంట హైవేపై
- పట్టుబడిన డ్రైవర్

వార్త మెయిన్‌లో

రేపే పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 2,84,637 మంది లబ్ధిదారులు
- రూ.123.32 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం



6

ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి వేగంగా అడుగులు

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'తో మార్పు మొదలు

- **37వ డివిజన్‌లో సమస్యల**

పరిష్కారంపై అధికారులు దృష్టి

ఒంగోలు, కార్పొరేషన్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా' పేరుతో చేపట్టిన వినూత్న కార్యక్రమానికి స్పందన లభిస్తోంది ఈనెల 28న ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌లో గల చెన్నకేశవస్వామి లేఅవుట్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై.. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేసిన సూచనలతో కార్పొరేషన్ అధికారులు కదిలారు. ఇరవై రోజుల్లో పార్కులో సమస్యలు పరిష్కరిస్తామని దామచర్ల హామీ ఇవ్వడంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, కార్యక్రమం జరిగిన 48 గంటల్లోనే అధికారులు పార్కులో పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం కమిషనరు డాక్టర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చెన్నుపాటి వేణుతో పాటు పార్కు అభివృద్ధి కమిటీతో కలిసి పరిశీలించారు. పార్కు ఆవరణలోని మైదానం లెవలింగ్‌తో పాటు, వాకర్స్ కోసం మట్టితో ట్రాక్, అలాగే పార్కులో వర్షం కురిసినపుడు నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై కమిషనరు పరిశీలించారు. ఇంజనీర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కారం చర్చవేదిక ద్వారా పలు సమస్యలపై దృష్టి సారించామన్నారు. తొలుత ఎమ్మెల్యే సూచనలతో పార్కు అభివృద్ధి, అక్కడి నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే డివిజన్‌లోని అన్ని కాలనీల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యత ప్రకారం, నిధుల సౌలభ్యతను బట్టి పరిష్కరిస్తామని చెప్పారు. సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఫిబ్రవరి మొదటి వారంలో వార్డుకో వారం కార్యక్రమాన్ని నిర్వహించి, పారిశుధ్యం సమస్య, దోమల నివారణ, అలాగే పింఛన్, రేషన్ కార్డులు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ, వ్యర్థాలు ఉండటం వంటి తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ప్రధానంగా వీలైనంత త్వరలోనే సైడు కాలువలు నిర్మిస్తామని చెప్పారు. డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం రూ.10 కోట్లు అవసరమున్నట్లు గుర్తించామని, వాటికి ప్రతిపాదనలు తయారు చేసి ఆమోదం లభించాక దశల వారీగా పనులు చేపడతామని వివరించారు. కార్పొరేటర్ చెన్నుపాటి వేణు మాట్లాడుతూ ఈనెల 28న జరిగిన చర్చా వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే, కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్నామని, వాటిని త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ చెంచయ్య, డీఈ అనీల్, ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చెన్నుపాటి ప్రసాద్, కుర్రా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వేణు, ప్రసాద్ తదితరులు

దివ్యాంగులకు నిరంతరం వైద్య శిబిరాలు



మానసిక దివ్యాంగురాలైన చిన్నారి కన్నతల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించి వారిలో మానసిక స్థైర్యాన్ని కల్పిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జిల్లా వికలాంగ సంక్షేమశాఖ సహకారంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శిబిరం వద్దకు వచ్చి మానసిక దివ్యాంగులను, వృద్ధులను పలకరించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. శిబిరంలో 600 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. కనిగిరి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మానసిక దివ్యాంగులైన తమ బిడ్డలను తీసుకువచ్చిన తల్లిదండ్రుల స్థితిని చూసి ఎమ్మెల్యే చలించిపోయారు.

సారూ.. మా బిడ్డను చూడయ్యా

శిబిరానికి వచ్చిన వారిని కలిసేందుకు ఎమ్మెల్యే ప్రాంగణంలోకి రావటంతోనే దివ్యాంగుల కుటుంబ సభ్యుల బాధలు, ఆర్తనాదాలు వినిపించాయి. సారూ ఇటు చూడు అంటూ నేలమీద పాకుతూ వచ్చిన యువతి.. బాబూ నా బిడ్డను చూడయ్యా అంటూ ఓ ప్రమాదం కారణంగా శరీరం పూర్తిగా అచేతనావస్థలో ఉన్న తన బిడ్డను చూపుతూ ఓ కన్నతల్లి... సార్..సార్ అంటూ ఓ మానసిక దివ్యాంగుడి తల్లి పిలుస్తున్న పిలుపులు.. నా బిడ్డలు బాగా నడుస్తారయ్యా కానీ ఏం మాట్లాడలేరు అంటూ.. ఇంకో పక్క మానసిక దివ్యాంగులైన తమ చంటి బిడ్డలను చూపుతూ.. వారి కుటుంబ సభ్యుల వైకల్య పరిస్థితిని ప్రతి ఒక్కరూ వివరిస్తుంటే ఎమ్మెల్యే చలించిపోయారు. ఆ క్షణంలో ఎమ్మెల్యే గుండెలు పిండేసినట్లయి మాట మూగబోయింది. వారి ఆరోగ్యస్థితిని బట్టి మీ అందరికి కావాల్సిన ఉపకరణాలు ఇస్తారు. మీ బిడ్డలకు, మీ కుటుంబ సభ్యులకు కొంత మెరుగ్గా ఉంటుంది అంటూ వారికి ధైర్యాన్నిచ్చారు. అత్యవసర సమావేశానికి వెళ్లాల్సి ఉన్నా వెళ్లకుండా దివ్యాంగులను పేరు, పేరునా పలకరిస్తూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిస్తూ గడిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు హెచ్ఎంపాడు మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), బాలు ఓబులరెడ్డి, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, మానవతాసంస్థ సోమిశెట్టి శ్రీనివాసులు, అలింకో ప్రతినిధులు, నాయకులు జంషీర్‌అహ్మద్, దొరసాని, స్వప్న, ధనలక్ష్మి, అమ్ములు తదితరులు శిబిరంలో వలంటీర్లుగా సేవలందించారు. మానవతాసంస్థ, అలింకో సహకారంతో ఐదుగురు మానసిక దివ్యాంగులకు అత్యవసరంగా వీల్‌చైర్స్ అందించే ఏర్పాటు ఎమ్మెల్యే చేశారు.

అహింసతో స్వాతంత్య్రం తెచ్చిన మహనీయుడు గాంధీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అహింసతో దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని రాష్ట్ర మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి చెప్పారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహానికి జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి మంత్రి స్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం, స్వాతంత్య్రం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను, సేవలకు గుర్తింపుగా ఆయనను మనం జాతిపితగా గౌరవించుకుంటున్నామన్నారు. గాంధీ చూపిన బాటలో మనమందరం నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన్న ఓబులేషు, ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీలో ఇద్దరు తొలగింపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వరరెడ్డిలను ఆ పదవుల నుంచి తొలగించారు. ఆ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ సీఈవో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎకె.ఫరీదా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల నకలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్‌కు పంపారు.


రెండు గ్రానైట్ లారీలు సీజ్

చీమకుర్తి, జనవరి30(ఆంధ్రజ్యోతి) : బిల్లులు, అను మతి పత్రాలు లేకుండా గెలాక్సీ గ్రానైట్ ముడిరాళ్లను తరలిస్తున్న రెండు లారీలను మైనింగ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఆర్ఎల్‌పురం పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలనుంచి తరలిస్తున్న లారీలను మైనింగ్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ తని ఖీల్లో విజిలెన్స్ అధికారి రామచంద్ర, ఆర్ఐ శివప్ప, టీఏ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

ఒంగోలు నగరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లబ్ధిదారులకు రాష్ట్రప్రభుత్వం ఠంఛన్‌గా పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన జిల్లాలోని పింఛన్ దారులందరికీ వారి ఇంటి వద్దకే పింఛన్ సొమ్మును అందించనుంది. ఫిబ్రవరిలో జిల్లాలోని 2,84,637 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేయనున్నారు. శనివారం ఉదయాన్నే అధికారులు ఇంటి తలుపుతట్టి వారి చేతికి నగదును అందజేయనున్నారు. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం జిల్లాకు రూ.123.32 కోట్లను విడుదల చేసింది. ఈ సొమ్మును జిల్లాలోని పలు బ్యాంకులకు బదిలీ చేసింది. ఈ నిధులను సచివాలయం సిబ్బంది శుక్రవారమే బ్యాంకుల నుంచి డ్రా చేసి శనివారం ఉదయం 5 గంటల నుంచే పంపిణీ చేయనున్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం జిల్లాలోని ఏ ఒక్కరికీ అనర్హత పేరుతో పింఛన్‌లను నిలుపుదల చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ పొందుతున్న వారిలో అనర్హులు ఎక్కువగా ఉన్నారంటూ గత కొన్ని నెలలుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల పింఛన్ పొందుతున్న వారిపై పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో మోడల్ ప్రాజెక్టు కింద ఒక గ్రామంలో ఉన్న పింఛన్‌లన్నింటినీ తనిఖీ చేయించింది. ఆ తర్వాత మంచానికే పరిమితం, వీల్‌చైర్‌లోనే జీవనం వంటి పేరుతో నెలకు రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారిని ఈ నెలాఖరు వరకు వైద్య బృందాలు తనిఖీ చేశాయి. వీటిలో 80శాతం బోగస్‌గా తేలాయి. ప్రభుత్వం ఇంకొద్ది రోజుల్లో దివ్యాంగుల పింఛన్లను కూడా వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించింది. బోగస్ సదరమ్ సర్టిఫికెట్లతో పింఛన్‌లను పొందుతున్న వారిని గుర్తించేందుకు ఈ పరిశీలన చేయనుంది. కానీ ప్రభుత్వం ఈనెల విడుదల చేసిన లబ్ధిదారుల్లో ఎవరికీ పింఛన్ నిలుపుదల చేయనట్లు తెలుస్తోంది. గతనెలలో పింఛన్ తీసుకున్న వారిలో చనిపోయిన వారికి తప్ప ఈ నెలలో అందరికీ పింఛన్ అందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్న క్యాంటిన్‌లో మందుబాబులకు నో ఎంట్రీ



రూ.5లకే పేదల ఆకలి తీర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కొందరు మద్యం సేవించి క్యాంటిన్‌కి వచ్చి సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై నిర్వాహకులు మద్యం సేవించి వచ్చేవారికి క్యాంటిన్‌లో ప్రవేశం లేదనే బోర్డును ఏర్పాటు చేశారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ లోని అన్న క్యాంటిన్‌లో ఇలా బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫలం

బాలినేని ఆయన అవసరం కోసమే పార్టీ మారాడు

మాజీ మంత్రి సురేష్ పార్టీ మారతారంటూ దుష్ప్రచారం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రచారంచేసి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలపై చేతులెత్తేశాడని దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో వచ్చాక ఆర్థిక పరిస్థితి బాగాలేదని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు అమలయ్యాయని చెప్పారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఆయన అవసరం కోసమే పార్టీ మారారన్నారు. అలాగే మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ పార్టీ మారుతున్నాడని కేవలం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు దుంపా చెంచిరెడ్డి, కఠారి శంకర్, బొట్లా సుబ్బారావు, ఇమ్రాన్‌ఖాన్, వేమా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పక్కన చుండూరి రవి, కఠారి శంకర్

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

(5వపేజీ తరువాయి)

లేదంటూ ముక్కుపిండి మరీ వసూలు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. బినామీల చేతిలో ఉన్న షాపులను స్వాధీనం చేసుకుని తిరిగి వేలంపాట ద్వారా అర్హులైన వ్యాపారులకు షాపులు కేటాయించనున్నారు. మొత్తంగా గత నాలుగైదు రోజులుగా మార్కెట్ ప్రక్షాళనపై కార్పొరేషన్ అధికారులు సీరియస్‌గా దృష్టిసారించడంతో అటు నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా, పలువురు వ్యాపారులు మాత్రం అధికారులపై గుర్రుగా ఉన్నారు.

ఆది నుంచి అన్నీ అక్రమాలే...!

ఒంగోలు నడిబొడ్డున ఊరచెరువులోని దామోదర సంజీవయ్య మార్కెట్ కేటాయింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. షాపుల కేటాయింపు నుంచి అద్దె నిర్ణయం వరకు లోపాలు ఉన్నాయి. కొందరు వ్యాపారులు ఏళ్లతరబడి ఎలాంటి అద్దె చెలించకపోగా, మరికొన్ని దుకాణాల్లో బినామీలు చేరిపోయారు. అద్దెకు తీసుకుంది ఒకరైతే వ్యాపారం చేస్తున్నది మరొకరు. ఎవరి పరిధిలోవారు నాటి రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. ఇతరులకు వేల రూపాయలకు అద్దెకు ఇచ్చారు. సకాలం పన్నులు, అద్దెలు చెల్లించకపోవడం లాంటి అనేక అవకతవకలు ఉన్నాయి. 2012లో మార్కెట్‌లో అవినీతిపై కొందరు ఎస్సీ, ఎస్టీ, బీసీల షాపుల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందంటూ లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో రెండేళ్లపాటు విచారణ చేసిన అప్పటి మునిసిపల్ ఆర్డీ షాపుల కేటాయింపుల్లో లోపాలు జరిగినట్లుగా గుర్తించారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఆర్థిక లోటును అధిగమించుకునేందుకు ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని, దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న పన్నులు వసూళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెలను వసూలు చేయాలని ఆదేశించింది. దీంతో అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో అధికారులు వసూళ్లపై దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన ఊరచెరువు మార్కెట్‌లో అవినీతి, అడ్డగోలు వ్యవహారం బట్టబయలైంది. బినామీలను ఖాళీ చేయించడంతోపాటు గత ప్రభుత్వంలో వ్యాపారులకు సహకరించి, అద్దెలు వసూళ్లలో చేతివాటం చూపిన రెవెన్యూ సిబ్బందిపైనా శాఖపరమైన చర్యలు తీసుకోన్నట్లుగా తెలిసింది.

వైసీపీ ప్రభుత్వంలో భారీగా భూ అక్రమాలు

(5వపేజీ తరువాయి)

ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలు అనేవి ఉండవని స్వామి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉందని, వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు పొందేందుకు అవకాశం కల్పించిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో వాట్సాప్ ఈగవర్నెన్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సేవలను ఈ వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ టీడీపీలో చేరుతున్నారా? అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు నిప్పు లేనిదే పొగ రాదు కదా అని మంత్రి బదులిచ్చారు.

సేవలు ప్రజల ముంగిటకే..

(5వపేజీ తరువాయి)

వినతులు కూడా స్వీకరించి వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. తొలిదశలో మొత్తం 161 రకాల పౌరసేవలను అందించనుంది. దేవదాయ, ఇంధన, ఏపీఎస్‌ఆర్టీసీ, రెవెన్యూ, మునిసిపల్ శాఖల్లో ఈ సేవలు ప్రారంభమవుతాయి. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వాట్సాప్ ద్వారానే పొందే విధంగా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇంకొకవైపు ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు కూడా ఈ వాట్సాప్‌నే వినియోగిస్తుంది. ప్రజలు ఏదైనా ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే ఈ నెంబర్‌కు మేసేజ్ చేస్తే వెంటనే వారికి ఒక లింక్ వస్తోంది. అందులో సంబంధిత వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, చిరునామా పొందుపరిస్తే సరిపోతుంది. వెంటనే వారికి రిఫరెన్స్ నెంబర్ కూడా వస్తుంది. దాని ఆధారంగా తాము ఇచ్చిన వినతి పరిష్కారం ఎంతవరకు వచ్చింది, ఎవరి వద్ద ఉందనేది కూడా తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు. మరోవైపు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అర్హతలు, పథకాల లబ్ధిపై కూడా ఈ వాట్సాప్ నెంబర్‌కు మేసేజ్ చేసి తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

విద్యుత్ బిల్లులు, పన్నులు చెల్లింపు

ఈ వాట్సాప్ ద్వారా విద్యుత్ బిల్లులు, ఆస్తిపన్నులు చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్సులు కూడా పొందేందుకు అవకాశం కల్పించారు. దేవాలయాల్లో దర్శనాల స్లాట్ బుకింగ్, వసతి బుకింగ్, విరాళాలు పంపడం వంటివి చేయవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించిన ల్యాండ్ రికార్డుల యాక్సెస్, వివిధ సర్టిఫికెట్లను కూడా పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ప్రతి ఒక్కరి వద్ద సెల్‌ఫోన్

ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. దాని ద్వారానే ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం కూడా సులభతరం చేసింది. ఏ సమయంలోనైనా తమ సమస్యలను ఆ వాట్సాప్ ద్వారా చేస్తే వెంటనే ఆ సమాచారాన్ని సంబంధిత అధికారుల వద్దకు చేరుతుంది. తద్వారా సత్వరమే పౌరసేవలు పొందేందుకు ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేస్తుంది.

రామతీర్థం జలాశయం గేటుకు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాత్కాలిక మరమ్మతులు

- నీటి సరఫరా 300 క్యూసెక్కులకు పెంపు
- రైతులకు తీరనున్న ఇబ్బందులు
- శాశ్వత మరమ్మతులకు ప్రణాళికలు

చీమకుర్తి, జనవరి30(ఆంధ్రజ్యోతి) : అయ్యో రామ..! అనే శీర్షికన ప్రమాదంలో రామతీర్థం అని గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కర్నూలు నుంచి గేట్ల బిగింపులో ప్రత్యేక నైపుణ్యం ఉన్న సిబ్బందిని హుటాహుటిన జలాశయం వద్దకు రప్పించి రోజంతా శ్రమించి ఒక గేటుకు తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించారు. ఆయకట్టు పరిధిలో పంటలకు సాగునీరు అత్యవసరమైన దశలో అధికారులు రిస్క్ తీసుకోకుండా 350 క్యూసెక్కుల ప్రవాహం ఒక గేటు ద్వారా నిరంతరం దిగువకు ప్రవహించేలా ఏర్పాటు చేశారు. దీంతో పలు మేజర్ల కింద వరి, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలను సాగుచేసిన రైతులకు ఈ సీజన్‌కు ఢోకా లేకుండా సరిపడా సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, డీఈ గిరిబాబు, ఏఈ పవన్, సాయిచరణ్, డబ్ల్యూఐ మల్లికార్జున మరమ్మతుల పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. జలాశయం వద్దకు చీమకుర్తి-2 డీసీ అధ్యక్షుడు పాలడుగు వెంకటనారాయణ, దర్శి-2 డీసీ అధ్యక్షుడు వెలుగొండారెడ్డి, చీమకుర్తి మేజర్ ప్రెసిడెంట్ గొగినేని శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఆయకట్టు రైతులు జలాశయం వద్దకు చేరుకొని గేటు మరమ్మతులో అధికారులకు సహకరించారు. గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించటానికి ప్రతిపాదించిన రూ.45లక్షలు మంజూరైతే శాశ్వతప్రతిపాదికన పనులు చేపట్టనున్నట్లు ఈఈ రామకృష్ణ రైతులకు తెలిపారు.



గేటు తిప్పి నీటి ప్రవాహాన్ని పెంచుతున్న ఈఈ రామకృష్ణ, వెంకటనారాయణ



మరమ్మతులు చేసిన తర్వాత బిగించిన గేటు

గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా

కనిగిరిలో ఇద్దరు అరెస్ట్

340 గ్రాముల స్వాధీనం

వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కనిగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా, విక్రయాలు సాగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీఎస్పీ సాయియశ్వంత్‌ఈశ్వర్ అన్నారు. కనిగిరిలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని గురువారం డీఎస్పీ నేతృత్వంలో సీఐ ఖాజావలి, ఎస్ఐలు మధుసూధన్‌రావు, కోటయ్యలు ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు.

పట్టణంలోని పాతూరుకు చెందిన పాత నేరస్థులైన నాగులూరి అంకబాబు, నాగులూరి వెంకటేశ్వర్లు దొరువు వద్ద ఉన్న దిగువ శివాలయం సమీపంలో గంజాయి ప్యాకెట్లు అమ్ముతున్నారు. పొదిలి ప్రాంతానికి చెందిన రమేష్, సాయి అనే వ్యక్తుల నుంచి 350 గ్రాములు గంజాయి కొనుగోలు చేశారు. వాటిని చిన్న, చిన్న పొట్లాలుగా చేసి చిన్న ప్లాస్టిక్ కవర్లలో వేసుకుని పట్టణంలోని మంచినీటి దొరువు వద్ద అమ్ముతున్నారు. ఆకస్మిక దాడి చేసి పరిశీలించగా వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లలో గంజాయి పొట్లాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారన్నారు. దీంతో వారిరువురినీ అదుపులోకి తీసుకుని విచారించగా పొదిలి ప్రాంతానికి చెందిన గంజాయి రవాణ చేసే రమేష్, సాయిల పేర్లను చెప్పారు. వారి కోసం గాలించగా పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్న డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టే కార్యక్రమంలో భాగంగా పోలీసు ఆంక్షలు విధించామన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం, అధికలోడు కర్రలతో ట్రాక్టర్లలో ర వాణా చేయటం, ట్రాక్టర్ సైడ్ డోర్‌లు ఒదిలేసి నడపటం, సైడ్ డోర్‌లపై కూలీలను ఎక్కించుకుని నడపటంతో పాటు హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపై వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐ ఖాజావలి, ఎస్ఐలు మాధవరావు, కోటయ్య, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సాయియశ్వంత్ ఈశ్వర్, పక్కన సీఐ ఖాజావలి, ఎస్ఐ మాధవరావు, కోటయ్య



ప్రతి ఒక్కరి జీవితంలో పెళ్లి అనేది ఒక ముఖ్యమైన, మహోన్నతమైన ఘట్టం. అటువంటి పెళ్లికి చక్కటి ముహూర్త బలం ఉండే నెల ఏదీ అంటే ఎవరైనా ఠక్కున చెప్పేది మాఘమాసమే. ఈ మాసంలో ఉన్న బలమైన ముహూర్తాలు మరే మాసంలో ఉండవని పండితులు, పురోహితులు చెబుతున్నారు. అందుకే ఈ మాసానికి అందరూ అంతటి ప్రాధాన్యత ఇస్తారు. ఈ మాసంలో బలమైన ముహూర్తాలలో పెళ్లిళ్లు చేసుకుంటే దాంపత్య జీవితం నిండు నూరేళ్లతోపాటు సుఖసంతోషాలతో ఉంటారని పురోహితులు చెబుతున్నారు. ఈ నెల 31న మాఘమాసం ప్రారంభమై ఫిబ్రవరి 28తో ముగియనున్న ఈ మాఘమాసంలో ఏకంగా 11 మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది జంటలు మూడుముళ్ల బంధంతో ఒక్కటి కానున్నాయి. వివాహ బంధంలోకి అడుగు పెట్టేందుకు యువతీ యువకులు సిద్ధమవుతుండగా, వివాహ వేడుకలకు కల్యాణ మండప యజమానులు, పురోహితులు, క్యాటరింగ్, పూలమండపాల వారు ఎవరి పనిలో వారు బిజీ అయ్యారు.



పెళ్లికి వేళాయే...!

• మాఘమాసంలో బలమైన ముహూర్తాలు • నేటి నుంచి నెలపాటు వివాహాల సీజన్

గిద్దలూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది. 'మాఘమాసం ఎప్పుడు వస్తుందో' అంటూ వేచి ఉండేవారి ఎదురు చూపులు ఫలించేలా మంచి ముహూర్తాలను తెచ్చేసింది. నేడు(ఈనెల 31న) తొలి రోజే మంచి ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు.

• గిద్దలూరు ప్రాంతంలో ప్రైవేటు కల్యాణ మండపాలు, లాడ్జి గదులు దాదాపు బుక్కయ్యాయి. కల్యాణ మండపాలను అలంకరించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. పూలమండపాల అలంకరణలు వేలల్లో పలుకుతున్నాయి. క్యాటరింగ్, పురోహితులు, షామియానా, కారు ట్రావెల్స్, ఫొటో, వీడియో గ్రాఫర్లు వారి సేవలకు ధరలు కూడా పెంచేశారు.

ఇదీ మాఘమాసం విశిష్టత

ఉత్తరాయన పుణ్యకాలంలో వచ్చే అత్యంత పవిత్రమైన మాసంలో పౌర్ణమినాడు చంద్రుడు మఖ నక్షత్రంలో సంచరించడం వలన దీనిని మాఘమాసం అంటారు. మాఘం అంటే పాపాలను పోగొట్టేది అని అర్థం. కార్తీక స్నానానికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మాఘస్నానానికి అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ఎన్నో శుభకార్యాలకు అనువైనది. సూర్యారాధన ఎంతో ముఖ్యమైనదిగా చెబుతారు.

ముహూర్తాల తేదీలు

ఈ మాఘమాసంలో ఈనెల 31, ఫిబ్రవరి నెల 2, 7, 8, 14, 15, 18, 20, 21, 22, 23 తేదీల వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఈ మాసంలో హడావుడిగా తేదీలు నిర్ణయించుకుని ఆయా రోజుల్లో పెళ్లిళ్లు చేయడం కష్టం అవుతుందని పలువురు చెబుతున్నారు.





మంచి ముహూర్తాలు

రాజు, పురోహితుడు, గిద్దలూరు



మాఘమాసంలో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. అన్ని నక్షత్రాల వారికి బలమైన ముహూర్తాలు వచ్చాయి. ఆ తరువాత వచ్చే మాసాలలో వివాహాలు అంతంత మాత్రంగా జరుగుతాయి.

ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్‌ఐవో సైమన్‌విక్టర్



మాట్లాడుతున్న ఆర్‌ఐవో విక్టర్

ఒంగోలు విద్య, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ జనరల్ సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో సైమన్‌విక్టర్ చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో గురువారం స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయోగ పరీక్షలు అన్ని వసతులున్న కళాశాలల్లోనే జరుగుతాయని తెలిపారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారన్నారు.

5నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 5నుంచి 20వ తేదీ వరకు మూడు విడతలుగా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలకు చీఫ్‌లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులను నియమించామన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 3902 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

10నుంచి జనరల్ సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు

ద్వితీయ సంవత్సరం జనరల్ సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 10నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని ఆర్‌ఐవో తెలిపారు ఈ పరీక్షలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14,538 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. మొత్తం 92 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను జిల్లా, బోర్డు కార్యాలయాలకు అనుసంధానించామన్నారు. ఈ సమావేశంలో పరీక్షల కమిటీ సభ్యులు కె. ఆంజనేయులు, ఎ. చంద్రశేఖర్, పి.కోటేశ్వరరావు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఓటు కార్డులు



ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యువ ఓటర్లతో పాటు ఇతర ఓటర్లకు సంబంధించిన ఎపిక్(గుర్తింపు) కార్డులు జిల్లాకు చేరాయి. జిల్లాలో ఈ నెల మొదటి వారంలో తుది ఓటర్ల జాబితా ప్రచురించడంతో ఎన్నికల కమిషన్ జిల్లాకు లక్షా 40వేల ఎపిక్ కార్డులను పంపింది. దీంతో గురువారం కలెక్టరేట్ నుంచి నియోజకవర్గాలకు పంపేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయా నియోజకవర్గాల వారీగా వచ్చిన ఎపిక్ కార్డులను రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. సిబ్బంది ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఎపిక్ కార్డులను పరిశీలించిన అనంతరం వాహనాల్లో తీసుకెళ్లారు.

మత్స్యకారుల వలకు అరుదైన చేప

రూ.7వేలకు కొనుగోలు చేసిన చేపల వ్యాపారి


అరుదైన చేపను చూపిస్తున్న మత్స్యకారుడు

వాడరేవు(చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని వాడరేవు మత్స్యకారుల వలకు అరుదైన చాప చిక్కింది. గ్రామానికి చెందిన యానాది అనే మత్స్యకారుడు ఎప్పటిలాగే వేటకు వెళ్లగా అతని వలకు సుమారు 4.5 అడుగుల చాప వలకు చిక్కింది. అది ట్యూనా చేపను పోలిన ముఖం, కింగ్ ఫిష్‌ను పోలిన శరీర భాగం ఉండడంతో అందరూ ఆశ్చర్యం చెందారు. ఈక్రమంలోనే దీనిని చూసేందుకు ఉత్సాహం చూపారు. దాని బరువు సుమారు 13 నుంచి 15కిలోలు ఉండగా, మునుపెన్నడూ లేని విధంగా వలకు చిక్కిన చేప పేరును గుర్తించ లేక పోయారు. ఆమోస్ అనే చేపల వ్యాపారి రూ.7వేలకు కొనుగోలు చేసి కేరళ రాష్ట్రానికి ఎగుమతి చేశారు.

నటన భళా.. నర్తనశాల

అలరించిన నాటక ప్రదర్శన.. ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

గాంధీ వేషంలో 108 మంది చిన్నారులు

ఘనంగా కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు

ఒంగోలు కల్చరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): అటు తమ అద్వితీయ నటనా వైదుష్యంతో ఇటు సంభాషణా చాతుర్యంతో ప్రేక్షకుల చేత భళిరాభళా అంటూ ప్రశంసలందుకున్నారు నర్తనశాల నాటకంలోని నటీనటులు. స్థానిక పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలలో భాగంగా గురువారం రాత్రి కాకినాడ శ్రీ కుమారరామ భీమేశ్వర కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ పద్య నాటకం ప్రదర్శితమైంది. మహాభారతంలోని విరాటపర్వ సారాంశంతో దివంగత కాళ్లూరి రామారావు రచించిన ఈ నాటకానికి ఎస్.కె.అమీర్ దర్శకత్వం వహించారు. ఇక అరణ్యవాసాన్ని పూర్తిచేసుకున్న పాండవులు ఏడాదిపాటు అజ్ఞాతవాసానికి విరాట్‌రాజు కొలువుకు ద్రౌపదితో సహా మారువేషంలో చేరుకోవటం, తన జైత్రయాత్రను పూర్తిచేసుకుని వచ్చిన విరాట్‌రాజు బావమరిది కీచకుడు ద్రౌపదిని చూసి మోహించటం అతనిని భీమసేనుడు ఉపాయంతో హతమార్చటం ప్రధాన కథాంశంగా కొనసాగిన ఈ నాటకంలో వివిధ ఘట్టాలలో నటీనటుల నటన, వారు పద్యాలను ఆలపించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో వివిధ పాత్రలలో టి.కోదండరావు, ఎం.వి.వి.ఎస్.ఆచారి, పి.ఎస్.రామకృష్ణ, పి.మణిబాల, బి.నాగమణి, ఎస్.కె.అమీర్, అమరా సత్యనారాయణ, పి.శివకళ్యాణ్, వై.శ్రీదేవి, ఎస్. సత్యనారాయణ తదితరులు నటించారు.


పంచభూతాల పాటలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

చివ్వటం గ్రామానికి చెందిన ఈశ్వర సాయి కృష్ణ నాదస్వర బృందంచే నాదస్వర కచ్చేరి అనంతరం పెదజాగర్లమూడికి చెందిన జట్టి పద్మావతి కోలాట బృందం ఆధ్వర్యంలో మహిళలు ప్రదర్శించిన కోలాటం కనులపండువగా కొనసాగింది. అదేవిధంగా చందూ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థుల నృత్యప్రదర్శన అద్భుతం అనిపించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకుంది.

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఆధ్వర్యంలో 108 మంది విద్యార్థులు గాంధీ వేషధారణతో ప్రేక్షకులను అలరించారు. జేసీఐ ప్రెసిడెంట్ ఎం.వెంకట సుబ్బారావు, జేఏసీ ఛైర్మన్ వెన్నపూస శ్రీరాములు రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో సీనియర్ విద్యావేత్త పి.హెచ్.సి.కృష్ణంరాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబులు ప్రదర్శన పారితోషికాన్ని, జ్ఞాపికలను బహూకరించి సత్కరించారు.



జయకృష్ణాముకుంద పాటలో చిన్నారుల ప్రదర్శన



పల్లెకు పోదాం.. పనులు చేద్దాం

కొన్ని దశాబ్దాల కిందట ఏ గ్రామంలో చూసినా ప్రతి ఇంట్లో తిరగలి, రోలురోకలి, మజ్జిగ చిలికే కవ్వం, చాట, కుంపటి ఇలా అనేక వస్తువులు కనిపించేవి. మహిళలు వాటితో వివిధ రకాల పనులు చేస్తూ కనిపించేవారు. క్రమేపీ అవి కనుమరుగయ్యాయి. తిరగలి, రోలు, రోకలి స్థానంలో గ్రైండర్, మిక్సీ వంటివి, కవ్వం బదులు కర్డ్ బీటర్, కుంపటి పోయి గ్యాస్ పొయ్యి ఇలా అధునాతన వస్తువులు వచ్చాయి. నాటి గ్రామీణ మహిళలు ఉపయోగించిన వస్తువులు వారి వేషధారణతో ఒంగోలులోని ఒక పాఠశాల విద్యార్థులు అలనాటి పల్లెవాతావరణాన్ని ప్రేక్షకుల ముందు ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. దీనిని అక్కడికి వచ్చిన ప్రేక్షకులు ఆసక్తిగా గమనిస్తే 60 ఏళ్లకు పైబడిన వారు తమ చిన్నతనంలో గ్రామంలో ఇదేవిధంగా ఉండేది అంటూ గతాన్ని గుర్తుచేసుకున్నారు.

కోనసీమ కాదు.. జొన్నతాళి!



మార్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):పక్క ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం కోనసీమను మైమరిపిస్తోంది కదూ.. ఒక వైపు తాగునీటి చెరువు, మరో వైపు పంట చెరువు, ఈ రెండింటి మధ్య మట్టి కట్టదారికి రెండు వైపులా ఎత్తుగా, గుబురుగా పెరిగిన పచ్చని చెట్లు. ఆ ఆహ్లాదకర వాతావరణం చూడగానే మనస్సు అనుభూతి చెందుతుంది. ఆ చెరువుల అందాలు.. వాటి చుట్టూ పచ్చదనం మార్టూరు మండలం జొన్నతాళి గ్రామంలో ఉన్నాయి. గ్రామ సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ బాధ్యతలు తీసుకున్న తర్వాత సొంత నిధులతో చెరువు చుట్టూ, చెరువుకట్టపై నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా పెరిగి చల్లని నీడను, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రాజమండ్రి నుంచి తెప్పించిన మూడురకాలైన కోనోకార్పస్, జమ్మి, గోల్డెన్ షవర్ మొక్కలు సుమారు 350 మీటర్ల దూరం వరకు నాటించారు. మట్టికట్టపై గ్రామస్థులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. చుట్టూ పొలాల్లో గొర్రెలు, మేకలను, గేదెలను మేపుకోవడానికి వచ్చిన వారు, చుట్టూ పొలాలకు వచ్చే రైతులు ఎండలు ఎక్కువగా ఉంటే ఈ చెట్ల నీడనే సేదతీరుతుంటారు. తాగునీటి చెరువు పక్కనే ఉన్న గంగమ్మ గుడిలో పూజలు, పొంగళ్లు, మొక్కులు తదితర వేడుకలు జరిగే సమయంలో కొందరు ఈ చెరువుల అందాలను చూసేందుకు వస్తుంటారు.

రేపు ఇంటర్ విద్యార్థులకు నైతిక, మానవ విలువల పరీక్ష : ఆర్ఐవో

ఒంగోలు విద్య, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి 1న నైతిక, మానవ విలువలపై పరీక్ష, 3న పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంచదువుతున్న జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 21,624 మంది హాజరుకావాలన్నారు. ఈ రెండు పరీక్షలు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తప్పనిసరి అన్నారు. జిల్లాలోని 186 కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నిర్వహణకు బోర్డు ద్వారా ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రాలను పరీక్ష సమయానికి అర్ధగంట ముందు కళాశాలల మెయిల్‌కు వస్తాయన్నారు. వాటిని తీసి జెరాక్స్ తీయించి విద్యార్థులు ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. గతంలో ఈ పరీక్షలు రాయని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇప్పుడు హాజరుకావచ్చన్నారు. ఈ రెండు పరీక్షలు రాసి అర్హత పొందిన వారికే ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జారీ అవుతుందని స్పష్టం చేశారు.

సబ్సిడీ రుణాల దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి

● బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు


దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలునగరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు కోసం అందజేస్తున్న సబ్సిడీ రుణాల దరఖాస్తులను గడువులోగా అప్‌లోడ్ చేయాలని ఈడీ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. గురువారం ఆయన ఒంగోలు నగరం రామ్‌నగర్‌లోని వార్డుసచివాలయంలో దరఖాస్తుల ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు, సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. దరఖాస్తు ప్రక్రియ చాలా సులభతరంగా ఉంటుందని, రెండు మూడు నిమిషాల్లో పూర్తవుతుందని తెలిపారు. వెనుకబడిన తరగతుల వారు, కాపు, అగ్రవర్ణ కులాల్లోని పేదలు, ఈబీసీ వర్గాలకు చెందిన వారు సచివాలయాలకు వస్తే వారికి అవగాహన కల్పించి దరఖాస్తు ప్రక్రియ చేయాలని ఆయన కోరారు.

డైరీ ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సంఘం డైరీని నెల్లూరు జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం-1లో గురువారం జరిగిన కార్యక్రమంలో డైరీని విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పైనం మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్‌లు కె.వర్షిణి, సోమసుందర్‌ప్రసాద్, డీసీటీవోలు ఎన్‌వీ.సుబ్బారావు, గుడి శ్రీనివాసరావు, కోటా సుధాకర్, ది సిటి ఎన్‌జీవోస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు సాధు నరసింహారావు, ఏలూరి కొండలరావు, అహ్మద్‌బాషా, పెద్దమ్మాయి, కిషోర్, వెంకటరెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పొగాకు రైతులకు శిక్షణ


పొగాకును పరిశీలిస్తున్న రామకృష్ణ

చీమకుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చండ్రపాడు గ్రామంలో వెల్లంపల్లి టుబాకో బోర్డు ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ పొగాకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రెలుపునకు 15రోజుల ముందు పంటపై క్రిమిసంహారక మందులు వినియోగించవద్దని, బేళ్ల సిద్ధం చేసే సమయంలో అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి తులసి, ఫీల్డ్ ఆఫీసర్ హర్ష, ఐటీసీ డీవో గుమ్మడి వెంకటరావు, జీపీఐ డీవో ఉన్నం శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ వికాస్, రైతులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళి

నాగులుప్పలపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్థంతిని ఉప్పుగుండూరులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. లైబ్రరీ వద్దనున్న గాంధీజీ విగ్రహానికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అమరా వేణు, పులకణం రాజేష్, కొంజేటి జలంధర్, నూకల దిలీప్, ప్రసాద్, దేసు సుధాకర్ పాల్గొన్నారు. ఫోరం ఫర్ సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు కొలకలూరి రమేష్, సభ్యులు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. సహాయ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశు ఆరోగ్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశువుల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణకు నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీఏ డాక్టర్ నాగభూషణం సూచించారు. మాచవరం, మట్టిగుంట గ్రామాల్లో గురువారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రభుత్వ పశువైద్యశాలల్లో చికిత్స చేయించాలని చెప్పారు. పశువైద్యులు జీవీ.సురేఖ, అనురాధ దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో ఆకు ముడత వైరస్‌ను నివారించాలి

నాగులుప్పలపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మిరపపంటలో కనిపించే ఆకు ముడత వైరస్‌ను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ ఏవో ప్రత్యూష సూచించారు. మాచవరంలో రైతులు సాగు చేసిన మిరప పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మిరప పంటలో తెల్ల దోమ ద్వారా వచ్చే ఆకుముడత నివారణకు 20 పసుపు రంగు జిగురు అట్టలు ఉపయోగించడంతో పాటు డైఫీన్ధురన్ 1.25 ఎంఎల్ గానీ, థైమిక్సీమ్ 0.3 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కాల్షియం, మెగ్నీషియం ఒక కేజీ, బోరాన్‌జింక్ 0.5 కేజీ చొప్పున పిచికారితో మొక్కలకు బలం చేకూరుతుందన్నారు. రైతులు ఫార్మర్ చాట్ యాప్‌లో పంటకు సోకిన తెగుళ్ల ఫొటో తీసి పంపిస్తే సస్యరక్షణ చర్యలను తెలియపరుస్తారని, మార్కెట్ ధరలను తెలుగులోనే సమాచారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మిని, రైతులు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులను తొలగించేందుకే రీ సర్వే

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న


గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

కొత్తపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న భూములకు కచ్చితమైన కొలతలను నిర్ధారించి రైతుల ఇబ్బందులను తొలగించేందుకే అన్నిగ్రామాల్లో ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. గురువారం కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామంలో జరిగిన రీసర్వే గ్రామసభలో ఆమె హాజరై ప్రసంగించారు. రీసర్వే ద్వారా గతంలో జరిగిన పొరపాట్లను సరిచేస్తారన్నారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసర్వే జరిగే తేదీని రెవెన్యూ అధికారులు ముందుగానే ఆయా గ్రామాల్లో దండోరా ద్వారా తెలియజేస్తారని, రైతుల సమక్షంలోనే జరుగుతుందని ఆమె చెప్పారు. రీసర్వే ద్వారా భూ వివాదాలు కూడా పరిష్కారం అవుతాయన్నారు. రైతులు తమ ఇబ్బందులను అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ గౌస్‌బాష, ఆర్ఐ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తి చేయాలి

● వైద్యశాఖ రాష్ట్ర జేడీ రమేష్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, పక్కన జేడీ రమేష్, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ ఆదేశించారు. స్థానిక ఐఎంఏ హాలులో గురువారం సాయంత్రం జిల్లాలోని వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందువల్ల వైద్యాధికారులకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది స్థానికంగానే నివాసం ఉండాలన్నారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను యాప్‌లలో ప్రతిరోజు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు ప్రతినెలా పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వైద్యశాఖ అధికారులు డి.సురేష్‌కుమార్, పద్మజ, వాణిశ్రీ, శ్రావణ్‌కుమార్, భగీరధి, శ్రీవాణి, హేమంత్, విక్టర్‌బాబు, మాస్‌మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు.. వేల గొంతులు'

● ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు ప్రభుదాస్


నినాదాలు చేస్తున్న ప్రభుదాస్, నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని ఆ సంఘ నగర అధ్యక్షులు గుంటూరి ప్రభుదాస్ కోరారు. గురువారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉందని, నగర కమిటీ తరుపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే వర్గీకరణ సాధన కోసం భారీగా చేపట్టిన లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమం ఎమ్మార్పీఎస్ పోరాట ఉద్యమంలో మరోసారి చరిత్రలో చిరస్థాయిగా నిలవబోతుందని చెప్పారు. ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సుమారు 300 డప్పులతో వేయి మంది మాదిగ సోదరులతో కలిసి పాల్గొంటున్నట్లు చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధుల బాబు, జంద్రాజుపల్లి ఆంజనేయులు, రాజబాబు, రమేష్, రవికుమార్, తేజ, అంకయ్య, గుంటూరి రజని తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి సేవలు ఆదర్శనీయం

● డిస్ట్రిక్ట్ గవర్నర్ గోపీచంద్


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న క్లబ్ గవర్నర్ గోపీచంద్ తదితరులు

చీమకుర్తి, జనవరి30(ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమైనవని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోపీచంద్ తెలిపారు. చీమకుర్తి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన కళావేదిక, శౌచాలయంలను గురువారం ఆయన ప్రారంభించారు. స్థానిక ఎన్ఎస్‌పీకాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన గాంధీ వర్థంతి కార్యక్రమంలో గోపీచంద్, డాక్టర్ బి.జవహర్, లయన్స్ ప్రతినిధులతో కలిసి పాల్గొని నివాళులర్పించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన కళావేదికను ప్రారంభించారు. తదుపరి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరినారాయణ ఆర్థికసహకారంతో నిర్మించిన శౌచాలయాలను ప్రారంభించారు. తదుపరి పలుసేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, ఆర్ లక్ష్మీనారాయణ, హేమసుందరం, చలువాది రమేష్, అంజిరెడ్డి, పార్థసారథి, వంశీకృష్ణ, అనుదీప్, యాకోబు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల సంఖ్యను ప్రభుత్వం పెంచాలి

● గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ డిమాండ్


శివపురంలో కాపరులతో మాట్లాడుతున్న శ్రీరామ్

టంగుటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు పెంపకందారులకు సరిపడా గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా గొర్రెలు, మేకలు పెంపకందారులకు లక్ష షెడ్లు నిర్మించాల్సి ఉంటుందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ పేర్కొన్నారు. ఆ సంఘ ప్రతినిధులతో కలిసి ఆయన గురువారం మండలంలోని టంగుటూరు, శివపురం, కందులూరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లోని గొర్రెలు, మేకలు పెంపకందారులతో వారు ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 లక్షల మంది గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఒకట్రెండు గోకులం షెడ్లు అలంకారప్రాయంగా నిర్మిస్తోందని ఆరోపించారు. జిల్లాలో 20వేల మంది గొర్రెలు, మేకలు పెంపకందారులుండగా, కేవలం వందల్లో షెడ్లు మంజూరు చేసిందని, మిగిలిన పెంపకందారులంతా తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు బుర్రా రాములు, రమణయ్య, సభ్యులు బుర్ర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే బంగారు భవిష్యత్ : ఎంపీడీవో



ఎంపీడీవో జ్యోతిని సత్కరిస్తున్న అధ్యాపకులు, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మద్దిపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంపీడీవో వి.జ్యోతి పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్ఐ శివరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా చదువుకుని వృద్ధిలోకి రావాలని కోరారు. తహసీల్దార్ సృజన్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకు ఓర్చుకుని పిల్లలను చదివిస్తారని, అదేవిధంగా అధ్యాపకులు సైతం మంచి విద్యను అందించటానికి కృషిచేస్తారని, దీనిని విద్యార్థులు దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదివానని, ఇక్కడే పనిచేస్తూ ఈ సంవత్సరం రిటైర్ అవుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణమూర్తి మృతి పట్ల సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరాభ్యుదయ కమిటీ సభ్యుడు, కాపు కళ్యాణ మండపం సభ్యుడు ఓగిరాల రాధాకృష్ణమూర్తి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కత్తి చెన్నకేశవనాయుడు, శీలం చంద్రశేఖర్, ఆరిగ చలమయ్య, కందుకూరు సాయి, గొర్రెపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు రుణాలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కోరారు. గురువారం ఒంగోలులో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియ ఆర్వో గుణేశ్వరరావును కలిసి ఈమేరకు వి నతిపత్రం అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉపాధి కల్పన కార్యక్రమం బ్యాంకుల ద్వారా 35శాతం రాయితీతో నిరుద్యోగ యువతను పారిశ్రామికవేత్తలుగా చూడాలన్న కలతో పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కొన్ని బ్యాంకులు నిరుద్యోగ యవతకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. అందువల్ల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కార్తీక్, కరుణాకర్, కృష్ణ, సూర్య, మరియదాస్, ప్రేమ్‌కుమార్, సాయి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని పేకాట శిబిరంపై ఎస్ఐ బి.శ్రీకాంత్ తన సిబ్బందితో గురువారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 9,950 నగదును స్వాధీనం చేసుకొన్నారు.

మద్యం షాపులో చోరీ

నాగులుప్పలపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని మట్టిగుంట రోడ్డులో గల మద్యంషాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, బుధవారం రాత్రి తేజ వైన్స్ దుకాణంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి సీసీకెమెరాలను కర్రతో పక్కకు తిప్పి షట్టర్ తాళం పగులగొట్టి కొంతమేర పైకిలేపి లోపలకు ప్రవేశించారు. కౌంటర్‌లోని సుమారు రూ.12 వేల నగదుతో పాటు ఒక ఫుల్, హాఫ్, క్వార్టర్ మద్యం బాటిళ్లతో పాటు సీసీకెమెరాల డీవీఆర్‌ను దొంగిలించి ఉడాయించారు. ఉదయాన్నే స్థానికులు గుర్తించి షాపు సూపర్‌వైజర్ ఆదిత్యకు సమాచారం అందించడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎయిడెడ్ టీచర్ల వివరాలను కోరిన డీఈవో

ఒంగోలు విద్య, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల వివరాలను శుక్రవారం సాయంత్రానికి తమ కార్యాలయంలో అందజేయాలని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం కోరారు. జిల్లాలో 135 పాఠశాలల్లో 613 మంది టీచర్లు పనిచేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 31నాటికి పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎంత మంది మిగులు టీచర్లు ఉన్నారు, ఎన్ని ఖాళీ పోస్టులున్నాయని వివరాలు ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి కోరారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ కళ్యాణి

ఒంగోలు విద్య, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాల డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం ఏకేయూ యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ డి.కళ్యాణిలు విడుదల చేశారు. విద్యార్థినులు 92.20 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 231 మందికి 213 మంది పాసయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వారు అభినందించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరెడ్డి, కుసుమకుమారి, యామిని అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

జర్దోసి మగ్గం వర్కులో ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, జనవరి30(ఆంధ్రజ్యోతి): జర్దోసి మగ్గం వర్కుపై వచ్చే నెల 7వ తేదీ నుంచి మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ 30 రోజులు ఉంటుందన్నారు. ఈ శిక్షణకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, పేర్లు నమోదు కోసం 8309915577 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉర్దూ సెక్షన్లను యథావిధిగా కొనసాగించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉర్దు సెక్షన్ పాఠశాల తరగతులను యథావిధిగా కొనసాగించాలని ఉర్దు టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అన్వర్‌బాషా, డి.సనావుల్లాలు కోరారు. ఈమేరకు ఒంగోలులో గురువారం డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 117 జీవో ఉపసంహరణ అనంతరం ఉర్దు పాఠశాలల్లో ఉర్దూ తరగతులను తెలుగు లేదా ఆంగ్లం మీడియం పాఠశాలల్లో లేదా మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయకుండా కొనసాగించాలని కోరారు. 45 మంది ఉర్దూ విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా గుర్తించాలన్నారు. డీఈవో పూల్‌లోని ఉర్దూ టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు.

'కలప దొంగలు'పై కేసులు నమోదు చేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొన్నలూరు, జనవరి30 (ఆంధ్రజ్యోతి): 'కలప దొంగలు' వార్తకు ఇరిగేషన్‌శాఖ ఒంగోలు డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు ఎం.శివరామప్రసాద్ స్పందించారు. కలప దొంగలపై కేసు నమోదు చేస్తామని ఆయన గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరుకూరు చెరువులో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చిల్లచెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారని తమశాఖలో సంబంధిత కిందిస్థాయి అధికారులు విచారణ చేసి నివేదిక ఇచ్చారన్నారు. చెరువులో కలపను తీసుకెళ్లకుండా, ఇటువంటివి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా తమశాఖతోపాటు గ్రామ పంచాయతీ, రెవెన్యూ, పోలీసు వారి సమన్వయంతో చర్యలు తీసుకుంటామని శివరామ ప్రసాద్ వివరించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు(రూరల్), జనవరి30(ఆంధ్రజ్యోతి): బీఎసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఒంగోలు ఎంపీడీవో శేషబాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అర్థులు సమీపంలోని సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

నాగులుప్పలపాడు: బీసీ, కాపు, ఆర్థికంగా వెనకబడిన తరగతులకు చెందిన వారు బీసీ కార్పొరేషన్‌ద్వారా రుణాలకు దరఖాస్తులు చేసుకొనేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి 7వ తేఈ వరకు అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో వై.మహాలక్ష్మి గురువారం తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా తగిన పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కొండపి: బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ కులానికి చెందిన, ఈడబ్ల్యుఎస్ వర్గాలకు చెందినవారు రుణాల కోసం వచ్చేనెల 7వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 250 యూనిట్లు మంజూరయ్యాయని వివరించారు.

గ్రానైట్ కార్మికుడు ఆత్మహత్య

మద్దిపాడు, జనవరి30(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటరులో గ్రానైట్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జార్ఖండ్‌కు చెందిన చందన్‌ప్రసాద్‌యాదవ్ గ్రోత్‌సెంటరలోఓని లక్ష్మీగాయత్రి గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఇటీవల ఆయన ఆర్థిక ఇబ్బందులకు తోడు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం ఫ్యాక్టరీలో తాను ఉండే రేకుల షెడ్డులో దువ్వకు ఉరివేసుకున్నాడు. అయితే కాసేపటికి అతని తమ్ముడు రాజ్‌కుమార్‌యాదవ్ వచ్చి తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లి చూసి తన సోదరుడిని వైద్యశాలకు తీసుకెళ్లగా వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. గురువారం మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ

మద్యం మత్తులో యువకుడిపై దాడి

బేస్తవారపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో దళిత యువకునిపై ఓ సమాజిక వర్గానికి చెందిన వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన ఘటన మండలంలోని గలిజేరుగుళ్ల గ్రామంలో గురువారం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన తోటకూరి పిచయ్య బేల్దారి పనికి రాలేదని అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ముకుమ్మడిగా కర్రలతో, రాళ్లతో కొట్టి దాడి చేశారు. గాయపడిన పిచ్చయ్యను స్థానికుల సహకారంతో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆయన అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై రవీంధ్రరెడ్డి తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

బేస్తవారపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన మండలంలోని ఓబినేనిపల్లె గ్రామంలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన రాజమ్మ బస్టాండ్ వద్ద నిలుచొని ఉన్నారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి బంగారు గొలుసును బలవంతంగా మెడలో నుంచి లాక్కోని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏస్సై రవీంధ్రరెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమి ఆక్రమణపై నోటీసులు

గిద్దలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన భూమిని ఆక్రమించిన ఏడుగురు వ్యక్తులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. గిద్దలూరు గ్రామ పరిధిలో 129-1లో ఉన్న 7.87 ఎకరాల పొలం దేవస్థానానికి ఉంది. ఈ పొలాన్ని ఆక్రమించి అక్రమంగా సాగు చేస్తున్నట్లు దేవదాయశాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో ఏడుగురు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 7న ఉదయం 11 గంటలకు తగు ఆధారాలతో హాజరుకావాలని రైతులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

నిరుపేదకు సరుకులు అందజేత


సరుకులు అందజేస్తున్న ఆంజనేయులు

మార్కాపురం వన్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పట్టణ అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు గురువారం పేద మహిళలకు సరుకులు, మందులు పంపిణీ చేశారు. పట్టణంలోని నాగులవరం రోడ్డులో నివసిస్తున్న షేక్ మౌలాబీ అనే మహిళ కూలి పనిచేసుకుంటూ ప్రమాదానికి గురైంది. పనిచేసుకోలేక ఆర్థిక పరిస్థితులతో సతమతమవుతున్న తరుణంలో ఆంజనేయులు స్పందించి నిత్యావసరాలు, ట్యాబ్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు రుద్రగుప్త, పాదాచార్యులు, సుబ్బారావులు పాల్గొన్నారు.

సంయుక్త పర్యవేక్షణ అధికారిగా మూర్తి


సీఎస్ఆర్ మూర్తి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన డా.సీఎస్ఆర్ మూర్తి వాణిజ్య పన్నుల శాఖలో అధికారిగా పనిచేస్తూ, మంగళగిరిలోని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు బదిలీ అయ్యారు. ఆ విభాగంలో సంయుక్త పర్యవేక్షణాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి నుంచి ఉత్తర్వులు అందాయి. వాణిజ్య పన్నుల శాఖ నుంచి రిలీవ్ అయి గురువారం మంగళగిరిలోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో బాధ్యతలు స్వీకరించారు.

నేడు వెలిగొండపై రౌండ్ టేబుల్ సమావేశం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు కూడలిలోని సీపీఐ కార్యాలయంలో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై శుక్రవారం ఉదయం 10 గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం

పెద్దదోర్నాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి కమిటీ సమా వేశం గురువారం నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కళాశాలకు స్థలసేకరణ, శాశ్వత భవనాల నిర్మాణం, వసతుల కల్పన, తదితర అంశాలపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో కమిటి కార్యదర్శి షేక్ మాబు,వై దాసయ్య, దేవయ్య, కె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ పింఛన్‌లను పరీక్షించిన అధికారులు


చిన్నకొలుకులలో పింఛన్ దారున్ని పరీక్షిస్తున్న వైద్యులు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని చిన్న కొలుకుల, గొళ్ల వీడపి, ఎర్రగొండపాలెం తదితర గ్రామాలలో హెల్త్‌పింఛన్ పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి అధికారులు పరిశీలించారు. గురువారం వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో బండారు శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాలలో పక్షవాతం 10, నరాల బలహీనత 3 మొత్తం 13 పింఛన్ దారులను సీఏఎస్‌జీఎం డాక్టర్ సితారామి రెడ్డి, డాక్టర్లు చంద్రశేఖర్, విద్యా సంజీవ్‌లు పరీక్షలు చేశారు. వారి రికార్డులను పరిశీలించారు. ఆ రికార్డులను, పరీక్షల నివేదికలను ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు వారు తెలి పారు. వారి వెంట గోళ్లవీడపి డీఏ మస్తాన్‌వలి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): రైల్వేస్టేషన్ ముందు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని బీజేపీ కోకన్వీనర్ గుమ్మా రాముడు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు తహసీల్దార్ ఆంజనేయ రెడ్డికి, మున్సిపల్ మేనేజర్ బీవీ. రంగారావుకు వినతిపత్రాలు అందచేశారు. రాముడు యాదవ్ మాట్లాడుతూ పట్టణం నుండి అటు పోరుమామిళ్ల, నంద్యాలకు వెళ్ళు బస్సులు రైల్వేస్టేషన్ ముందు బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వేస్టేషన్, బస్టాండ్ ఒకే దగ్గర ఉండడం, నిత్యం 500 మంది వరకు రైళ్ల నుంచి దిగడం, ఎక్కడం చేస్తున్నారన్నారు. రైల్వేస్టేషన్ ముందు బస్సు ఎక్కేవారి సంఖ్య ఎక్కువ ఉండడంతో బస్‌షెల్టర్ లేక ఎండకు, వానకు ఇబ్బందులు పడుతు న్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రూరల్, మండల అధ్యక్షులు కాకునూరి తిరుపాల్‌రెడ్డి, జిల్లా ఓబీసీ కార్యదర్శి నున్నా వీరచక్రం, రమేష్ ఉన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం 31వ తేది శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కమీషనర్ వెంకటదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ పాముల ఎవెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్తుకు భరోసా

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా
- రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీ పరిష్కరించాలని ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బాలికల బంగారు భవిష్యత్తుకు 'బంగారు బాల్యం' భరోసాగా నిలుస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక కళాశాల రోడ్డులోని సౌజన్య ఫంక్షన్ హాలులో గురువారం డివిజన్ పరిధిలోని అధికారులకు బంగారు బాల్యంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ అందరూ సమన్వంతో బాలల భవిష్యత్తు కు బంగారు బాటలు వేయాలన్నారు. బాలికలను సాధికారత దిశగా ఎదగనిస్తేనే వారి భవిష్యత్తుకు భరోసా ఉంటుందన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. బాలికల ఆరోగ్యం, విద్య, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాల న్నారు. మారుమూల ప్రాంతాల్లో ఎంతోమంది బాలలు బడికి వెళ్లకుండా పనులబాట పడుతున్నారన్నారు. బాలలను తప్పక బడికి పంపాలన్నారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయున్ని నోడల్ ఆఫీసర్‌గా నియమించి డ్రాపవుట్స్‌పై దృష్టి సారిస్తామన్నారు. వయసును బట్టి శిక్షణ ద్వారా వారి లోని నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నారు. బాల్యవివాహాల వలన గర్భం దాల్చి అనారోగ్యంతో కూడిన బావిభారత పౌరులకు జన్మనిస్తున్నార న్నారు. ప్రభుత్వ వైద్యశాల ల్లోనే ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంద న్నారు. ప్రతి సచివాలయం పరిధిలో బాలబాలికలతో పాటు కిషోర బాలికల వివరాలు త ప్పక నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ వెంక ట్ త్రివినాగ్, డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, ఐసీ డీఎస్ పీడీ హీనాసుజన్, తహ సీల్దార్ చిరంజీవి, కమిషనర్ నారాయణరావు, సీఐ పి.సుబ్బా రావు, ఎస్సై సైదుబాబు పాల్గొన్నారు.


పాల్గొన్న వివిధశాఖల అధికారులు

తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

కొనకనమిట్ల : మండల రెవెన్యూ కార్యాలయంలో తక్షణం పరిష్కరించదగిన సమస్యలు కూడా కాలయాపన చేస్తూ పరిష్కరించకుంటే సహించనని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. గురువారం మార్కాపురం సబ్‌కలెక్టర్‌తో కలసి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సులకు ఎన్ని అర్జీలు వచ్చాయి? ఎన్నింటిని పరిష్కరించారని డీటీ అరుణకుమారిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చిన అర్జీదారుడికి స్వయంగా కలెక్టర్ ఫోన్‌చేసి మాట్లాడారు. మీఅర్జీపై అధికారులు మీతో మాట్లాడారా? సమస్య వివరాలను అడిగి తెలుసుకున్నారా? అని అర్జీదారుడినుండి వివరణ తీసుకొన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను నిర్ధిష్ట గడువులో పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. భూముల మ్యూటేషన్ ప్రక్రియలో నిబంధనల పాటించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీదారులతో ప్రత్యేకంగా ఫోన్‌లో సమాచారం అడిగి తెలుసుకుం టానని స్పష్టం చేశారు. అర్జీలు వచ్చిన తరువాత పరిష్కరానికి చర్యలు తీసుకోకుండా చేద్దాం, చూద్దామని తాత్సారం చేస్తే అటు వంటి అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

న్యాయం జరిగేనా?

పోలీసులను ఆశ్రయించిన తిరుమలరావు


పోలీసులకు వివరాలు తెలిపి వస్తున్న తిరుమలరావు దంపతులు

ఎర్రగొండపాలెంరూరల్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి) : నకిలి పత్రాలు సృష్టించి తమఆస్తిని ఇతరులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అరోపిస్తు మూడురోజులుగా అధికారులు చుట్టూ తిరుగుతున్న వృద్ధులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. స్థానిక బాలికల వసతి గృహం ఎదురుగా సర్వే నెంబరు 58-1లో 5కుంటల స్థలం, గృహాన్ని మండలంలోని సర్వాయి పాలెంకు చెందిన దొడ్డపనేని శ్రీనివాసులు ఆయన భార్య యోగమ్మకు రిజిష్టర్ చేశారు. ఆ రిజిస్ట్రేషన్ అక్రమమని బాధితుడు తిరుమలరావు ఆరోపించాడు. ఈ విషయంపై మూడు రోజులుగా తహసీల్దార్ కార్యాలయానికి, పోలీసు స్టేషన్‌కు తిరుగుతున్నారు. గురువారం కూడ స్థానిక సిఐ సిహెచ్ ప్రభాకరరావు పిలవడంతో వృద్ధులైన ఆయన, ఆయన భార్య వెళ్లారు. తమ వద్ద ఉన్న రికార్డులను సీఐకి అందజేసినట్లు వారు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నకిలిపత్రాలు పెట్టి రిజిస్ట్రేషన్ చేశా రంటూ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయటం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధి కారులైన జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. అయితే వారు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లగా, వారికి సమాదానం చేప్పే వారే కరువయ్యారని అని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి


యంత్రపరికరాలను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

కంభం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు రాయితీపై అందచేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకో వాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కంభం మండలం లోని కంభం 2, 4, కందులాపురం 1, 2 రైతు సేవా కేంద్రాల పరిదిలో కమ్యునిటి హైరింగ్స్ సెంటర్ గ్రూపులకు రాయితీపై ఇచ్చిన వ్యవసాయ పరికరాలను ఆయన పరిశీలించారు. పరికరాల ధరలు, రాయితీ వివరాలు గ్రూపు సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ వ్యవసాయాధికారుల నుంచి రిజిష్టర్లను, ఇతరత్రా పరిశీలించారు. వ్యవసాయ పరికరాల వినియోగం గురించి రైతులను అడిగారు. బ్యాంక్ ఈఎంఐలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి స్వరూప, వ్యవసాయ విస్తరణాధికారి జి.శివగంగ ప్రసాద్, టి.చెన్నారెడ్డి, అస్మత్, షేక్ ఉమర్, బి.రమేష్, రబ్బాని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

ఏర్పాట్లపై సబ్‌కలెక్టర్ త్రివినాగ్, టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు సమీక్ష


ఆలయంలో పూజల్లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు, టీడీపీ ఇన్‌చార్జ్

త్రిపురాంతకం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 26 నుండి 28 వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి విజయవంతం చేయాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి మహాశివ రాత్రి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై అమ్మవారి ఆలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం మెరుగైన ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం తాగునీరు వంటి సౌకర్యాలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం వెళ్లే భక్తులకోసం అదనపు బస్సులు నడపాలన్నారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ భక్తులకు ఆసౌకర్యం లేకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, శాంతిభద్రతల సమస్యల లేకుండా చూడాలన్నారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్ల కోసం డీఎఫ్‌వోతో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఆలయ హోర్డింగులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్నెస్పీ కాలువపై రెండో వంతెన కోసం ఆర్అండ్‌బీ మంత్రి జనార్ధనరెడ్డితో మాట్లాడామన్నారు. త్వరలో మంజూరవుతుందన్నారు. శంకుస్థాపన కూడా చేస్తామన్నారు. ఈవో రజనీకుమారి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేట్లు ఏర్పాటుచేసి దర్శనాలను కల్పిస్తామన్నారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు అవసరమైన అన్ని రకాల మందులను, 104, 108 వాహనాలను అందుబాటులో ఉంచుతామన్నారు. మూడుచోట్ల శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏడు చోట్ల మంచినీటి సరఫరాను ఏర్పాటు చేస్తామని ఏఈఈ తెలిపారు. అవసరమైన మేర బస్సులను ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా 300 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని సీఐ అస్సాన్ తెలిపారు. ఎన్నెస్పీ కాలువ వంతె న వద్ద, మిగిలిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బం దులు తలెత్తకుండా చూస్తామన్నారు. అన్ని శాఖల అధికారులూ ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని తహసీల్దారు శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారావు, విద్యుత్‌శాఖ డీఈఈ నాగేశ్వరరావు, ఈవోఆర్డీ రామసుబ్బయ్య, ఎంపీపీ రిబ్కా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.ఆలయ అధికారులు సబ్‌కలెక్టర్, ఎరిక్షన్‌బాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

పశువులకు వైద్యపరీక్షలు


గొట్లగట్టులో దూడలను పరీక్షిస్తునన వైద్యాధికారి

కొనకనమిట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్లగట్టు, వద్దిమడుగు గ్రామాలలో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు రాజ్యలక్ష్మి, అమూల్యలు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలికాలంలో వచ్చే వ్యాధుల గురించి పశువుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి పశుపోషకులకు వివరించారు. వద్దిమడుగు గ్రామంలో గొర్రెలకు, మేకలుకు నాచునివారణ టీకాలు వేశారు. గేదెలకు చూడు పరీక్షలు నిర్వహించారు. అనంతరం నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అదేవిదంగా గొట్లగట్టు గ్రామంలో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో 3546 గొర్రెలకు, మేకలకు, 63 దూడలకు నట్టల నివారణ ముందులు పంపిణీచేశారు. అదేవిదంగా 15 గేదెలకు కృత్రిమ గర్భదారణ ఇంజక్షన్లు, ఆరు గేదెలకు చూడు పరిక్షలు చేసినట్లు ఆమె తెలిపారు. అనారోగ్యంతో ఉన్న పశులకు, గేదెలకు మందులు పంపిణీ చేశామన్నారు. గొర్రలు, మేకల్లో వచ్చే బొబ్బవ్యాధికి టీకాలు వేయించు కోవాలని చూసించారు. కార్యక్రమంలో గొట్లగట్టు సర్పంచ్ సుఖ్‌దేవ్, వద్దిమడుగు సర్పంచ్ పిన్నిక పిచ్చయ్య, ఎంపిటీసీ వెలుగొండయ్య, టీడీపీ నాయకులు పరిటాల సుబ్బయ్య, పొదిలి తిరపతయ్య, వేముల శ్రీనివాసులు, ప్రభాకర్, సంజీవ్‌రెడ్డి పసువైద్యసహాయకులు బరిగె శ్రీనివాసులు, మెగావత్ శివాజినాయక్, వెటర్నరి అసిస్టెంట్ పూర్ణచంద్ర, ఓఎస్ పిల్లి నాగార్జునరెడ్డి, ఏహెచ్‌ఏ నాగేంద్రమ్మ, సిబ్బంది మెహబూబ్‌భాష, నాగరాజు, శ్రీజ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాలు ప్రారంభం


అభిషేకం కోసం గంగాజలం తెస్తున్న మహిళలు

గిద్దలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాలలో మూడు రోజుల పాటు జరుగనున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. అమ్మవారిశాలలో మహాగణపతిపూజ, ఆర్య వైశ్య పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకుసుమ హరనాథ మందిరం ఆవరణ నుంచి మహిళలు సామూహికంగా తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం జరిగిన అమ్మవారి గ్రామోత్సవ కార్యక్రమంలో మహిళలు పసుపురంగు దుస్తులు ధరించి దీపాలతో గ్రామో త్సవంలో పాల్గొ న్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకు లు ఆయా పూజా కార్య క్రమాలలో పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఆర్యవైశ్య సంఘం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, సూరె వెంకట సుబ్బారావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సరం నవం బరు నెలలో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను సెల్ యజమానికి ఎస్సై పి చౌడయ్య అందజేశారు. దోర్నాల మండలానికి చెందిన జి.వెంకట కోటయ్య నవంబరు నెలలో ఆర్టీసీ బస్టాండ్‌లో పోగొట్టుకున్నాడు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాదితుని ఫిర్యాదు మేరకు సాంకేతిక విభాగంతో కలసి పోన్ ఎక్కడ ఉందో గుర్తించారు. గురువారం బాధితుడిని పిలిపించి ఆయనకు అందజేశారు. దీంతో బాదితుడు ఎస్సై చౌడయ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారిగా శ్రీనివాసచారి

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కోశాధికారిగా చెన్నుపల్లి శ్రీనివాసచారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం ఉపాధ్యక్షులు ముత్తలూరి మల్లికార్జునచారి గురువారం తెలిపారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చేవూరి రామస్వామి (హైకోర్టు అడ్వకేట్) ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు శ్రీనివాసచారిని అభినందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జమ్మోజు వెంకటేశ్వర చారి, బోడ్డోజు బాలయోగి, రంగోజు మల్లికార్జున చారి, లింగాల సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసి కార్మిక పరిషత్ టిఎన్‌టియుసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షులుగా పి.రవీంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నందీశ్వర రావు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఖాజా వలి, సంయుక్త కార్యదర్శులుగా శివశంకర్, అజయ్‌బాబు, ఆర్గ నైజింగ్ కార్యదర్శిగా రంగయ్య, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా లాల్‌మహబూబ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్.బాబు, కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు నూతన కమిటీ తెలియజేసింది.

పరీక్ష అట్టల పంపిణీ

గిద్దలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలంలోని రాచర్ల, ఆకవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో గాంధీ వర్ధంతి సందర్భంగా పరీక్ష అట్టలను చిన్ని సేవా సంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ 10వ తరగతి విద్యార్థులకు అందచేశారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ శివ, హెచ్‌ఎంలు రామానాయక్, సుధాకర్‌రావులు పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి


మహాత్ముని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై చెరగని ముద్ర వేసి దేశానికి స్వాతంత్ర ఫలాలు అందించిన మహనీయుడు గాంధీజీ అని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అహింస అనే ఆయుధంతో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వ్యక్తి మహాత్మగాంధీ అని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చేలా శాంతియుతంగా పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మగాంధీ అని తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపారని, భారతదేశంపై చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, పెద్ద వలి, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, ఓ.వెంకటయ్య, బాలరాజు, జాఫర్, తదితరులు ఉన్నారు. శాఖాగ్రంథాలయం నందు జాతిపిత మహాత్మగాంధీ 78వ వర్ధంతిని నిర్వహించారు. మహాత్మగాంధీ చిత్రపటానికి గ్రంథపాలకులు ప్రసన్నకుమారి, డాక్టర్ మొర్రి పిచ్చయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు రామిరెడ్డి, సుబ్బారెడ్డి, సయ్యద్ ఖాజా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

తర్లుపాడు : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పొట్టి శ్రీరాములు పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్, ఉపాధ్యాయులు ఆనంద్, వెంకటేశ్వరరెడ్డి, బి.శ్రీనివాసులు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి విజయ్ భాస్కర్ రావు, దోగిపర్తి మల్లికార్జునరావు, సుబ్రహ్మణ్యం, పి.జనార్ధన్, కశ్శెట్టి వెంకట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మ గాంధీజి వర్ధంతి కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ వర్ధంతిని పురష్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బతి సుబ్బారావు అధ్యక్షతన స్థానిక నటరాజ్ కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం సిద్ధి కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగెళ్ల సత్యనారాయణ, చలపతి, రావికింది రాజ, చీదెళ్ల నారాయణ, మొగిలి గుప్తా పాల్గొన్నారు.

గిద్దలూరు : ఆవోపా ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి సందర్భంగా గిద్దలూరులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు దారా రాములు, కార్యదర్శి కె.సుబ్బారావు, కోశాధికారి సూరె సుబ్బరామయ్య, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆదాం, రామరత్న ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ కిరన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే చట్టప్రకారం ముందుకెళ్తాం

రుద్రసముద్రం దాడి ఘటనపై ఎస్టీ కమిషన్ విచారణ



ధ్వంసం చేసిన రేకులషెడ్‌ను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

దొనకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మం డలంలోని రుద్రసముద్రం గ్రామంలో దాడికి గురైన ఎస్టీ కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమశంకర్ నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈనెల 16వ తేదీన రుద్రసముద్రం గ్రామంలోని ఎస్టీ కుటుంబంపై ఆదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేసి వారి రేకులషెడ్‌ను ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఇతర వస్తువులు కాలిపోయిన ఘటపై బాధితులు, ప్రజా సంఘాల నాయకుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన విచారించారు. ముందుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి దాడి సమయంలో ఇంట్లో ధ్వంసమైన వస్తువులు, తగులబడిన రేకులషెడ్‌ను పరిశీలించారు. బాధిత కుటుంబం నుంచి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో ఎటువంటి సెక్షన్లు నమోదు చేశారని కురిచేడు ఇన్‌చార్జి ఎస్సై శివను అడిగి తెలుసుకొన్నారు. ఎఫ్ఐఆర్‌ను పరిశీలించి గిరిజన కుటుంబంపై విచక్షణా రహితంగా దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీతో ఫోన్‌లో చర్చించారు.

అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రుద్రసముద్రం గ్రామంలో ఎస్టీ కుటుంబంపై ఇటువంటి సంఘటన జరగటం దురదృష్టకరమని, ఈ ఘటనకు పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత ఎస్టీ కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులకు ప్రస్తుతం లక్షా యాభై వేల రూపాయలు, కేసు నడుస్తుండగా మరో రూ.4.50 లక్షలు సహాయం అందేలా, ఇంటి నిర్మాణం, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆటో ఇప్పించేలా తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఎస్టీ కుటుంబంపై జరిగిన దాడి కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి తప్పుచేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించే విధంగా ముందుకు వెళ్లాలని పోలీసులను కోరారు. అనంతరం తహసీల్దార్ రమాదేవితో చర్చించి బాధిత కుటుంబం జీవనోపాధి నిమిత్తం రేషన్ సరుకులు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ తన సిబ్బంది ద్వారా పంద కేజీల బియ్యం, ఆరు కేజీల కందిపప్పు, నాలుగు కేజీల పంచదార వెంటనే సమకూర్చగా వాటిని బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారిణి వి. వరలక్ష్మీ, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మోహన్‌కుమార్‌ధర్మా, యానాది సంక్షేమ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పేరం సత్యం, గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆర్. సైదానాయక్, ఎరుకల హక్కుల పోరాట సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



హెల్త్ పింఛన్లపై విచారణ చేస్తున్న డాక్టర్ల బృందం

ఆరోగ్య పింఛన్లపై విచారణ

పామూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నెలనెలా రూ. 15 వేలు తీసుకొంటున్న హెల్త్ పెన్షన్‌దారులను వైద్య బృందం గురువారం విచారణ చేపట్టింది. మండలంలోని వగ్గంపల్లి, చిలంకూరు, చింతలపాలెం, రావిగుంటపల్లి, పడమటకట్టకిందపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో హెల్త్ పింఛన్లు తీసుకొంటున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మండలంలో మొత్తం 30 పింఛన్లు ఉండగా గురువారం 12 మంది పింఛన్‌దారులను విచారించి సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. ఈ బృందంలో డాక్టర్‌లు బి. ఆంజనేయులు, సౌజన్య. ఎం. విజయకుమార్‌తో పాటు ఎంపీడీవో బి. సురేష్, సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



డీలర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

రైతులకు సరైన ఎరువులు అందించే బాధ్యత డీలర్లదే

దర్శి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రైతులకు సరైన ఎరువులు, పురుగు మందులు అందించే బాధ్యత డీలర్లదేనని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో 2023-24 బ్యాచ్‌కు సంబంధించిన డీలర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, అవగాహన పెంపొందించుకొని రైతులకు అవసరమైన మందులు అందించాలన్నారు. ఎరువుల దుకాణాల వద్ద లైసెన్సులు అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలని, కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీలర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జి. రమేష్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, సుబ్రమణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

దొనకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3,4,5 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర 27వ మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహాసభలకు చెందిన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించి దొనకొండలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కర్నా హనుమయ్య, సీఐటీయూ మండల అధ్యక్షుడు కుందుర్తి నర్సింహులు, కార్యదర్శి కోలా కిరణ్‌కుమార్, బండారు బ్రహ్మయ్య, రాయన వెంకటయ్య, అంజిబాబు, మరికొందరు కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీపల్లిలో

పీసీపల్లి: సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను పీసీపల్లిలో గురువారం ఆ పార్టీ ప్రాంతీయకమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టీఫెన్, కొండయ్య, తిరుపతిరెడ్డి, కోటేశ్వరరావు, ప్రభుదాసు తదితరులు ఉన్నారు.

అహింసా మార్గాన్ని అనుసరించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, టీడీపీ నేతలు

కనిగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గాంధీ చూపిన అహింసా మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ ప్రాంగణంలోని విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపూజి కలలుగన్న సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య, ఓబులుశెట్టి ఓబులేసు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, తాతపూడి స్టాలిన్, ఫిరోజ్, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

దొనకొండలో

దొనకొండ : స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కేవీ హనుమంతరావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అచ్యుత శంకర్, పరుచూరి రామలింగయ్య, మాడిశెట్టి రమేష్, గొనుగుంట్ల హరినాథ్, మాడిశెట్టి సురేష్, పరుచూరి రమేష్, గుడిపాటి అంజి మరి కొందరు ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళ్లూరులో

తాళ్లూరు : ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ తాటికొండశ్రీనివాసరావు, జడ్పీటీసీసభ్యుడు మారం వెంకటరెడ్డిలు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పామూరులో

పామూరు : పట్టణంలోని సీఎస్‌పురంరోడ్ లోఉన్న గాంధీ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు యారవ శ్రీనువాసులు, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, డీవి మనోహర్, ఇర్రి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని సిద్ధాంతాలు సమాజానికి ఎంతో అవసరం

● ఆంధ్ర గాంధీ తిరుపతయ్య



ఓటరు దినోత్సవ అవగాహన కార్యక్రమంలో గాంధీ వేషంలో (ఇన్‌సెట్లో) తిరుపతయ్య

పామూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : గాంధీ సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, వాటిని పలు సందర్భాల్లో ప్రచారం చేయడమే తన ధ్యేయమని గడిఫూటి తిరుపతయ్య (ఆంధ్రగాంధీ) అన్నారు. పామూరు మండలం పోతవరం గ్రామానికి చెందిన తిరుపతయ్య టెలికాంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ 2020లో ఉద్యోగవిరమణ చేశారు. 2018 నుంచే గాంధీ వేషధారణ వేస్తూ పలు సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జనవరి 26 రిపబ్లిక్ డే, జనవరి 30న గాంధీ వర్ధంతి, ఆగస్టు 15 స్వాతంత్రం దినోత్సవం, అక్టోబరు 2 గాంధీ జయంతి కార్యక్రమాల్లో మహాత్ముడి వేషధారణలో పాల్గొంటున్నారు. ఈనెల 25 న పామూరులో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవం, 26న రిపబ్లిక్‌డే కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులతో కలిసి జెండావందనం, ఓటరు అవగాహనలో తిరుపతయ్య గాంధీ వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

మిరప తోటల పరిశీలన



తలకొండపాడులో మిరపను పరిశీలిస్తున్న హెచ్‌వో కుసుమ

ముండ్లమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం గ్రామంలో రైతులు సాగు చేసిన మిరప తోటలను దర్శి నియోజక వర్గ ఉద్యాన శాఖ అధికారి రవి వెంకన్న బాబు పరిశీలించారు. పంటలో నల్లి, తామర పురుగులు ఎక్కువగా ఉండటం గమనించి రైతులకు పలు సూచనలు చేశారు పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చటం వల్ల ఆకులు వెనక్కి ముడుచుకు పోయి తిరగవేసిన పడవ ఆకారంలో కన్పిస్తాయన్నారు. దీని నివారణకు డైకోఫాల్ ఐదు మిల్లీ లీటర్లు లేదా నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు, క్లోరిపిన్‌ఫైర్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీరు కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అదే విధంగా తామర పురుగు ఆకు అడుగు భాగంలో గుంపులుగా చేరి రసాన్ని పీల్చటం వల్ల ఆకుల పై బొప్పర్లు ఏర్పడి ఆకు అంచులు పైకి ముడుచుకు పోతాయన్నారు. ఈ పురుగులు కాయలను ఆశించి రసాన్ని పీల్చటం వల్ల కాయల మీద సారలు ఏర్పడి గిడస భారిన పడతాయన్నారు. దీని నివారణకు ఎస్పేట్ 1.5 గ్రాములు లేదా పిప్రోనిల్ రెండు మిల్లీ లీటరర్లు లేదా క్లోరోపిన్ ఫైర్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటితో కలిపి అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో పరిశీలించిన హెచ్‌వో

పీసీపల్లి : మండలంలోని తలకొండపాడు గ్రామంలో రైతులు సాగుచేసిన మిరపపంటను పీసీపల్లి ఉద్యానశాఖ అధికారిణి కె.కుసుమ గురువారం పరిశీలించారు.ఈ పరిశీలనలో మిరపలో తామరపురుగు, తెల్లదోమ ఉన్నట్లు ఆమె గుర్తించారు. వీటి నివారణ కోసం పిప్రోనిల్ లేదా స్పైనోసాడ్‌ను పిచికారీ చేయడం ద్వారా తామరపురుగు, తెల్లదోమలను నివారించవచ్చునని రైతులకు ఆమె వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కల్యాణ్, రైతులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 385 అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా అర్జీదారులను విచారించి వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే అర్జీదారులు నిర్లక్ష్యానికి గురికాకుండా పరిష్కరించాలన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్‌వోలపై ఉందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ పీ శేషగిరిరావు, మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వోలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

పోలీసు స్థలాల పరిశీలన

ముండ్లమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్‌కు సంబంధించి సర్వే నెంబరు 25లో ఉన్న 3.66 ఎకరాల స్థలాన్ని గురువారం జిల్లా వెల్ఫేర్ ఆర్ఐ సీతారామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే అలాంటి వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేస్తామని ఆయన తెలిపారు. పోలీసు ఖాళీ స్థలాల్లో పోలీసు క్వార్టర్స్ లేదా పోలీసు పెట్రోల్ బంకులు నిర్మించి అభివృద్ధిలోకి తీసుకువస్తామన్నారు. స్థానిక తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చి పోలీసు స్టేషన్ స్థలాల హద్దులు చూపించాలని ఎస్ఐ వై. నాగరాజుకు సూచించారు. దర్శి నియోజక వర్గంలోని ముండ్లమూరు, దర్శి, కురిచేడు, దొనకొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న స్థలాలను పరిశీలిచానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై. నాగరాజు, ఏఆర్ఎస్ఐ సోమేపల్లి కోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి, పాల్గొన్న శాస్త్రవేత్తలు

వేసవిలో నువ్వు, మినుము పంటలు సాగు చేసుకోవాలి

దర్శి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వేసవిలో నువ్వు, మినుము పంటలు సాగు చేసుకోవాలని దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి. సంధ్యారాణి సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం శిక్షణ , పంటల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు వరిపంట కోసిన తర్వాత మాగాణి భూమిలో మినుము, లేదా నువ్వు పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువులతో పాటు పోషకాలను త్వరగా అందించే ద్రవరూపంలో ఉన్న మందులు వాడితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి సుబ్రమణేశ్వరరావు, వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, హరిత, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేసిన పంటలను సందర్శించారు.

కూలి రూ .300 తగ్గకుండా పని కల్పించాలి

● డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

కనిగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నరేగా పథకం ద్వారా కూలీలకు రోజులో రూ.300లు తగ్గకుండా ఉపాధి పని కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జీ జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక నరేగా కార్యాలయంలో నియోజక వర్గస్థాయి సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో వెయ్యి మందికి పైగా పనులు కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 100 మందికి ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామంలో వ్యవసాయానికి సంబంధించిన పనులు మాత్రమే చేయించేలా అధికారులు, సిబ్బంది చొరవ వహించాలన్నారు. టీఏలు, ఎఫ్ఏలు కొలతలు ఇవ్వటంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా శాఖాపరమైన చర్యల్లో భాగంగా విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ప్రతి టెక్నికల్ అసిస్టెంట్ గ్రామంలో ఎఫ్ఏ నిర్వహిస్తున్న పనులు ప్రాంతానికి వెళ్లి రోజువారీ నివేదిక ఎప్పటికప్పుడు శాఖకు సంబంధించిన గ్రూపుల్లో సమాచారం చేరవేయాలని సూచించారు. మేట్‌ల ద్వారా కూలీలను గుర్తించి పనులకు పంపాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి రోజులో 20మందికి తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలన్నారు ఈ సమావేశంలో ఏపీడీ రాజారావు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి

తాళ్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి ముందుకు సాగాలని బీజేపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి మాదపాకుల శ్రీనివాసులు అన్నారు. తాళ్లూరులోని అంబేద్కర్ నగర్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు చందోలు రామారావు, డాక్టర్ జప్పారావు ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్‌దివస్ కార్యక్రమం గురువారం జరిగింది. అంబేడ్కర్ కాలనీకి చెందిన నాదెండ్ల శ్రీను ఇంటిలో బీజేపీ నాయకులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనాన్ని గురించి వివరించారు. బీఆర్ అంబేద్కర్ దూరపు చూపుతో రాజ్యాంగంలో అన్ని విషయాలకు స్పష్టత ఇచ్చినందునే సమాజంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ రాజ్యాంగాన్ని అనుసరించి పాలన సాగిస్తున్నారన్నారు. ముందుగా భారతమాతకు, రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంవిధాన్ గౌరవ్‌దివస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాస్తాది ఆంజనేయులు, రూరల్ మండల అధ్యక్షులు కాకర్ల నాగసాయి, జిల్లా యువ మోర్చా నాయకులు చెరుకూరి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతపై అట్రాసిటీ కేసు

తాళ్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతపాలెం గ్రామంలో దళితులు సాగుచేసుకుంటున్న పంట భూమిని నష్టపరిచి, ఆభూమిని ఆక్రమించుకునేందుకు యత్నించిన వైసీపీ నేత యడ్ల మల్లయ్యపై గురువారం ఎస్సీఎస్టీ ,అట్రాసిటీ కేసు నమోదయింది. గత ఏడాది జూలైలో ఆగ్రామ వైసీపీ నేత యడ్ల మల్లయ్య తన అనుచరులతో కలిసి దళితులు సాగుచేస్తున్న పంటను దున్ని, అడ్డుకో బోయిన మహిళలను కులంపేరుతో దూషించారు. దళిత మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా పట్టించుకోలేదు. అప్పటి ఎస్సై, తహసీల్దార్‌లు పట్టించుకోలేదు. దీంతో విషయం ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాదికారుల ఆదేశంతో దర్శి సీఐ రామారావు గురువారం చింతలపాలెం వెళ్లి పరిశీలించి బాధితులను విచారించారు. సీఐ ఆదేశాలతో ఎస్సై ఎస్‌మల్లిఖార్జునరావు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చిల్లచెట్లు తొలగింపు



దర్శిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌చుట్టూ తొలగించిన చిల్లచెట్లు

దర్శి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ అల్లుకున్న చిల్లచెట్లను సిబ్బంది తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 29వ తేదీన ప్రమాద భరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి పట్టణంలోని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చిల్లచెట్లు తొలగించి శుభ్రం చేశారు. ప్రమాదాలు జరగకుండా త్వరలో కంచెలు ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

క్రైం సమాచారం

దొనకొండలో చోరీ



బీరువాను పగులగొట్టి చిందరవందర చేసిన వస్తువులు

దొనకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కనే ప్రధాన రహదారిలో ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. అందిన సమాచారం మేరకు సయ్యద్ సనావుల్లాఖాన్(పాపా) కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి 15 రోజుల క్రితం విజయవాడకు వెళ్లారు. దొంగలు ఇంటి పక్కన ఉన్న స్థలంలో నుంచి గోడదూకి లోపలకు ప్రవేశించి ఇంట్లో ఉన్న బీరువాను పగులకొట్టారు. అందులో ఉన్న బంగారు చెవి కమ్మలు, 25 తులాల వెండి పట్టీలు, వెండి గిన్నెలు, ఒక సెల్ ఫోన్, రూ.5వేల నగదు చోరీ చేశారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి వచ్చిన పాప ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి ఆందోళనకు గురయ్యారు. వెంటనే చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





పొగాకు సాగు

- నష్టాలతో తగ్గిన మిరప..
- శనగ వెలవెల.. మెరిసిన మొక్కజొన్న
- మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు




సాగు.. తారుమారు

అతివృష్టి.. అనావృష్టి.. తెగుళ్లు.. దిగుబడులు తగ్గడం.. ధరలు లేకపోవడం.. నష్టాలు.. కష్టాలతో.. సాగు చిత్రం ఏటికేడు మారిపోతోంది. పంటల సాగు తారుమారవుతోంది. నష్టాలు.. ధరలను బట్టి రైతులు సాగు చేసే పంటలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వస్తున్నారు. ఏటేటా పంటల సాగు మారుస్తున్నా ఏమాత్రం కలసి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో వాణిజ్య పంటలు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని డెల్టాలో వరి ఎక్కువగా సాగవుతుంటోంది. అయితే ఈ సారి వర్షాలు చాలావరకు పంటలను దెబ్బతీశాయి. దీంతో రైతులు సాగు చేసే పంటలను ఏటికేడు మారుస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గత ఏడాది కన్నా ఈ ఏడు మిరప సాగు 55,804 ఎకరాల్లో తగ్గింది. మిరపకు ప్రత్యామ్నాయంగా పొగాకు.. మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపారు. గత ఏడాది ఆశాజనకంగా లేక పోవడంతో ఈ ఏడాది శనగ సాగును వేలాది మంది రైతులు వీడారు. మొత్తంగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో పంటల సాగులో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఏటికేడు సాగు చిత్రం మారిపోతున్నది. తెగుళ్లు.. గిట్టుబాటు ధర లేకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో రైతులు ఈ ఏడు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు పండించినా మిగులు లేక అప్పుల ఊబిలో కూరుకుపో తుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి సాగు చేస్తున్న రైతులు విసిగి వేసారిపోతున్నారు. తక్కువ పెట్టుబడులు.. ఎక్కువ దిగుబడులతో.. కొంతైనా లాభాలతో బయటపడే అవకాశం ఉన్న పంటల సాగుకు ఎక్కువ మంది రైతులు ఆశక్తి చూపుతున్నారు. మొక్కజొన్న, పొగాకు సాగు గణనీయంగా పెరగ్గా మిరప, శనగ సాగు అదే స్థాయిలో పతనమైంది. గత ఏడాకి కన్నా మిరప, శనగ సాగు 1,15,503 ఎకరాల్లో తగ్గింది. మొక్కజొన్న, పొగాకు సాగు గత ఏడాది కన్నా 99,550 ఎకరాల్లో పెరగడం గమనార్హం.



శనగ

పంటల సాగు ఇలా(ఎకరాల్లో)..

పంటలు	గత ఏడాది	ఈ ఏడాది
మిరప	1,71,226	1,15,422
పొగాకు	44,035	91,585
శనగ	1,38,052	78,352
మొక్కజొన్న	52,000	1,09,247



మొక్కజొన్న

ధర పతనంతో తీవ్రంగా నష్టం

గత ఏడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైతులు విస్తృతంగా మిరప సాగు చేశారు. వర్షాభావం.. తెగుళ్ల మిరప దిగుబడులపై (మిగతా 6వ పేజీలో)

మంగళగిరి చేనేతకు జీవం



చేనేత పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత



- మంగళగిరి చేనేతకు జీవం
- 10.80 ఎకరాల్లో మెగా చేనేత పార్కు

చేనేతకు మంత్రి నారా లోకేశ్ పునరుజ్జీవం

- నేతన్నల రెండున్నర దశాబ్దాల కల సాకారం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి
- కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశాలు

మంగళగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చేనేత ఖిల్లా మంగళగిరిలో చేనేతకు జీవం పోసేందుకు మంత్రి నారా లోకేశ్ తీసుకున్న సంకల్పం నెరవేరింది. ఒకప్పుడు చేనేత మగ్గాల సవ్వడులతో.. తెల్లవారుతూనే పరిచినట్టు కనిపించే మొలకట్టుడు అల్లికలతో.. సంప్రదాయ కళతో కనువిందు చేసే వీధులతో దర్శనమిచ్చిన నాటి చేనేతకేంద్రం మంగళగిరికి తిరిగి ఆ శోభ సంతరించుకోకున్నది. వివిధ కారణాలతో ఐదారు వేల మగ్గాలు ప్రస్తుతం 14 వందలకు తగ్గిపోయాయి. మంగళగిరిలో ప్రాభవం కోల్పోయిన నాటి చేనేత కళకు పునరుజ్జీవం పోయాలని దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నేతన్నలతోపాటు చేనేత కార్మికసంఘాలు, వామపక్ష పార్టీలు పాలకప్రభుత్వాలను వేడుకుంటూనే ఉన్నాయి. అడపాదడపా పోరాటాలు కూడా చేస్తూ వచ్చాయి. కానీ స్పందన మాత్రం శూన్యం. ఏళ్లుగా మెగా చేనేత పార్కు మంగళగిరివాసులను ఊరిస్తూ వస్తోన్నది. అయితే నారా లోకేశ్ తన రాజకీయ జీవితానికి చేనేత కేంద్రమైన మంగళగిరేనే ఎంచుకోవడంతో మంగళగిరి దశ తిరిగింది. ఈ క్రమంలో మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఆవిర్భవించబోతుంది. నగరంలోని ఆటోనగర్‌కు వెనుకవైపు శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెంబరు 16లోని 10.80 ఎకరాలను 31 ఏళ్ల లీజుకు తీసుకుని చేనేత పార్కును నెలకొల్పేందుకు చేనేత జౌళి శాఖ సిద్ధమైంది. ఎకరాకు రూ.25 వేల వంతున..ప్రతీ మూడేళ్లకు పది శాతం వంతున లీజు పెంచేలా దేవదాయశాఖతో చేనేత జౌళిశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. చేనేతపార్కు కోసం నిర్దేశించిన ఈ స్థలాన్ని ఆ శాఖ మంత్రి ఎస్ సవిత సంబంధితశాఖ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పార్కును తమిళనాడులోని

(మిగతా 6వ పేజీలో)

ఆటోనగర్‌లో ఇప్పటికే వీవర్స్‌శాల

లోకేశ్ ఆటోనగర్ ప్రాంతంలో తన సొంత ఖర్చులతో లోకేశ్ ప్రత్యేకంగా వీవర్స్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణను ఇప్పిస్తున్నారు. తయారైన వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో తృప్తి చెందని లోకేశ్ మంగళగిరికి ఒకనాటి ఖ్యాతిని మళ్లీ తెచ్చేందుకు ప్రత్యేకంగా చేనేత పార్కు నిర్మాణానికి పూనుకున్నారు.



రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనం (ఊహచిత్రం)



వేర్‌హౌస్ (ఊహచిత్రం)

పునరావాసం.. పాట్లు

- గుండ్లకమ్మ ముంపు గ్రామస్థుల అవస్థలు
- సమస్యలపై బాధితుల గోడు.. స్పందించిన మంత్రులు
- త్వరలో పర్యటిస్తామని గొట్టిపాటి, రామానాయుడు హామీ
- ఇప్పటికే సమస్యలపై అధ్యయనం చేస్తున్న అధికారులు



ధేనువకొండ గ్రామం



అద్దంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉండే అవకాశం లేదు.. పునరావాస కాలనీల్లో ఉండలేరు.. వసతులు కల్పించడంలో పాలకుల నిర్లక్ష్యం.. మొత్తమ్మీద గుండ్లకమ్మ ముంపు గ్రామీణులు సరైన ఆవాసం.. వసతులు లేక అల్లాడుతున్నారు. సమస్యలపై గత ఐదేళ్ల వైసీపీ పాలకులు పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యలపై దృష్టి సారించాలన్న ముంపుగ్రామాల ప్రజల గోడుపై కూట మి ప్రభుత్వంలో స్పందన వచ్చింది. స్థానిక ఎమ్మె ల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడం, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ముంపు గ్రామాల సమస్యలపై అవగాహన ఉండడంతో తమ కష్టాలు తీరతాయని గుండ్లకమ్మ బాధితులు ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు త్వరలో పర్యటిస్తామని హామీ కూడా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే గుండ్లకమ్మ రిజర్వాయర్ పర్యవేక్షణ అధికారులు ఇటీవల తిమ్మారెడ్డిపాలెంలో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశారు.

ముంపు గ్రామాల్లో ఉండలేక

పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన జరగకపోవడంతో గుండ్లకమ్మ ముంపు గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రిజర్వాయర్ నిర్మాణంతో మద్దిపాడు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లోని 13 గ్రామాలు పూర్తిగా, పాక్షికంగా ముంపునకు గురయ్యాయి. రెండు దశాబ్దాల కిందట గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభం కాగా, పుష్కర కాలం కిందట ఆయా గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వతో మద్దిపాడు మండల పరిధిలోని గ్రామాలు పూర్తిగా మునిగి పోయాయి. దీంతో ప్రజలు సుమారు పుష్కరకాలం కిందట గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కాలనీలకు తరలిపోయారు. అయితే పాక్షిక ముంపు గ్రామాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతుంది. పునరావాసకాలనీల్లో వసతుల కల్పన అటకెక్కింది. తిమ్మారెడ్డిపాలేనికి చెందిన పునరావాసకాలనీలో కనీస మౌలిక వసతుల కల్పన జరగలేదు. రోడ్లు, మంచినీటి వసతి, వీధిలైట్లు, పాఠశాలను ఏర్పాటు చేయలేదు. కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇక గ్రామంలో ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి నివాసానికి కూడా పనికిరాకుండా పోయాయి. దీంతో పలు కుటుంబాలు ఇతర గ్రామాలకు, అద్దంకి తదితర పట్టణాలకు వెళ్లి నివాసం ఉంటున్నాయి. ధేనువకొండ పునరావాస కాలనీ గ్రామానికి సుమారు 30 కి.మీ దూరంలో ఉన్న అద్దంకి, వేలమూరిపాడు, మేదరమెట్ల వద్ద ఉంది. ఆ కాలనీలో నివాసం ఉంటూ పనులకు వెళ్దామంటే పనులు దొరకని పరిస్థితి. ధేనువకొండ సమీపంలోని పునరావాసకాలనీలో ఇంకా వసతుల కల్పన పూర్తి కాలేదు. బలరామకృష్ణాపురంలో దశాబ్ద కాలంగా దేవాలయం ప్రతిష్ఠ జరగలేదు. ధేనువకొండలోనే 70 శాతానికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నా ముంపు గ్రామం పేరుతో వీధిలైట్లు, డ్రెయినేజీ సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదు. మణికేశ్వరంలో ఇంకా ఇళ్ల స్థలాలకు భూసేకరణ జరగలేదు. గతంలో కేటాయించిన పునరావాసకాలనీలో వసతుల కల్పన పూర్తి కాలేదు. కొరిశపాడు మండలం అనమనమూరు పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. యర్రబాలెంలో కొద్దిమంది ఇంకా గ్రామంలోనే ఉన్నారు.



పూర్తిగా శిథిలావస్థకు చేరిన గృహాలు

శిథిలావస్థకు చేరిన ఇళ్లు



ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఏ సమయంలో కూలిపోతాయోనని భయంతో ఉండాల్సిన పరిస్థితి. దీంతో కొంతమంది ఇళ్లను ఖాళీ చేసి వేరే గ్రామాలకు వెళ్లారు.

- వెలనాటి నాగమల్లి, తిమ్మారెడ్డిపాలెం

శివాలయం ప్రతిష్ఠ జరగలేదు



పుష్కరకాలం కిందట పునరావాసకాలనీకి వచ్చినా ఇంకా వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. కనీసం మంచినీటి సరఫరా లేదు. దేవాలయం ధ్వజ స్తంభం ఏర్పాటు జరగక పోవడంతో ప్రతిష్ఠ కూడా జరగలేదు.

- అన్నాబత్తిన సురేష్, బలరామకృష్ణాపురం పునరావాసకాలనీ

అదనంగా ధాన్యం సేకరణ

- 50,000 ఎంటీలకు డీఆర్సీలో తీర్మానం
- సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు తాజాగా ప్రతిపాదనలు
- ఇప్పటికే జిల్లాలో 57 వేల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో రికార్డుస్థాయిలో 57,000 మెట్రి క్ టన్నుల ధాన్యాన్ని మద్దతుధరకు కొనుగోలు కేంద్రాల నుంచి ప్రభుత్వం సేకరిం చింది. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతుండడం తోడు బహిరంగా మార్కెట్‌లో ధర మరీ తీసికట్టుగా ఉండడంతో అన్నదాతలు ప్రభుత్వం కొనుగోళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ఇప్పటికే పూర్తికాగా ఇంకా పెద్ద సంఖ్య లో ధాన్యం కోతకు సిద్ధంగా ఉంది. డెల్టాలో ఇంకా 50,000 టన్నుల ధాన్యం పొలాల మీదే ఉండగా, ఎన్ఎస్పీ ఆయకట్టు కింద సాగైన వరి త్వరలోనే చేతికొచ్చే అవకాశం ఉంది. పర్చూరు పరిధిలోని రైతులకు న్యాయం జరగాలంటే మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల విషయంలో అదనంగా అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఈ అంశమే ప్రధాన అజెండాగా కలెక్టరేట్‌లో మంగళవారం డీఆర్సీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ధాన్యం అదనంగా సేకరించడానికి ప్రభుత్వం అనుమతుల విషయంలో అటు ప్రజాప్ర తినిధులు, ఇటు అధికారులు ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. దీంతో ఇంకో 50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇవ్వాలని డీఆర్సీ తీర్మానం చేసింది.

తొలుత 50,000.. తర్వాత 7,000

ప్రభుత్వం ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు జిల్లాలో తొలి విడతలో 50,000 టన్నులకు అనుమతులిచ్చింది. అవసరాన్ని బట్టి దఫాదఫాలుగా మరో 7,000వరకు అనుమతులి చ్చింది. 57వేల మెట్రిక్‌టన్నుల సేకరణ కూడా పూర్తికాగా.. ఇంకా పెద్దసంఖ్యలో ధాన్యం రైతుల వద్ద ఉంది. ఈ పరిస్థితుల్లో మరో 50,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమ తులివ్వాలని సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు అధికారులు బుధవారమే ప్రతిపాదనలు పంపారు. అదనంగా ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా ప్రజాప్రతినిధులు గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. అన్నదాతల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సివిల్ సప్లయిస్ రాష్ట్ర విభాగానికి కూడా క్షేత్రస్థాయిలో రైతులవెతలను ఏకరువుపెట్టి అనుమతులు ఇచ్చేలా కోరనున్నారు.



ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గత నవంబరులో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9329 మంది హాజరవుగా 5198 మంది ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో జవాబు పత్రానికి రూ. 1490 ఫిబ్రవరి 13వ తేదీలోగా చెల్లించి కళాశాల ద్వారా డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్, ఆచార్య కె. ధనలక్ష్మి, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, సీటీప, ఏసీటీప పరీక్షల అధికారులు పాల్గొన్నారు.



వలపర్ల, రామకూరు మధ్య గోతులమయంగా మట్టిరోడ్డు

రెండు గ్రామాలు.. రెండు మండలాలు

» నియోజకవర్గాలను కలిపే ఈ రహదారిని పట్టించుకోండి మహాప్రభో

మార్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాలను.. కాదు రెండు మండలాలను.. కాదు కాదు ఏకంగా రెండు నియోజకవర్గాలను కలిపే రహదారి ఇది. ఈ రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. అంతా మట్టిరోడ్డు, అక్కడక్కడా భారీగా గుంతలు ఏర్పడ్డాయి. గత కొన్నేళ్ల నుంచి ఈ రహదారిని పట్టించుకునేవారే కరువయ్యారు. పర్చూరు నియోజకవర్గంలో మార్టూరు మండలం వలపర్ల గ్రామం నుంచి, అద్దంకి నియోజకవర్గంలోని జె.పంగులూరు మండలం రామకూరు గ్రామాన్ని కలిపే రహదారి. ఈ రెండు గ్రామాల మధ్య దూరం కేవలం రెండు కిలోమీటర్ల లోపే. దానిలో కొంతభాగం వలపర్ల గ్రామ పంచాయతీలో, మరి కొంతభాగం రామకూరు గ్రామ పంచాయతీలో ఉంది. రోజూ ఈ రహదారి గుండా రెండు గ్రామాలకు చెందిన ప్రజలు అటు ఇటు రాకపోకలు సాగిస్తుంటారు. రామకూరుకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు రోజూ వలపర్ల జడ్పీ హైస్కూల్‌కు వస్తుంటారు. ఇక చిలకలూరిపేట, అద్దంకి ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు రామకూరు, వలపర్ల గ్రామాల మీదగా రోజూ నాలుగైదుసార్లు అద్దంకి చి, లకలూరిపేటలకు ప్రయాణికులను చేరవేస్తుంటాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారిని పట్టించుకున్నవారు లేరని రెండు గ్రామాలకు చెందిన గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం ఏదోలా ప్రయాణిస్తున్నా, వర్షాకాలంలో లేదా మోస్తరు వర్షం కురిసిందంటే ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయమేనని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు రెండు గ్రామాల నాయకులుకు, మండల స్థాయి నేతలుకు ఈ రోడ్డు పరిస్థితిని గురించి అవగతమే. కానీ ఇంతవరకు రోడ్డు రూపురేఖలు మారలేదు. మరి రెండు నియోజకవర్గాల శాసనసభ్యులైనా రోడ్డుపై ఓ కన్నేస్తే బాగుంటుందని, కూటమి ప్రభుత్వం వచ్చింది కదా రోడ్డు బాగుపడుతుందిలే అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి ఖర్చులకు రూ.15వేలు

» హర్షం వ్యక్తం చేసిన తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ సభ్యులు



సీఎంకు థ్యాంక్స్ చెప్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అద్దంకిటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసేవారు చనిపోతే మట్టి ఖర్చులకు రూ.15వేలను ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వం జీవో చేయడంపట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అద్దంకిలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పూలతో ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అంగన్‌వాడీల జీతాల కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి దీక్షలు చేసినా పట్టించుకోలేదన్నారు. మట్టిఖర్చుల పథకాన్ని వారు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ప్రశాంత వాతావరణం, అంగన్‌వాడీల సమస్యల కోసం ప్రభుత్వం చూపిన చొరవతో ప్రతి నెల 1వ తేదీనే జీతాలు అందుతున్నాయన్నారు. అలాగే పని భారాన్ని తగ్గించినందుకు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ధనలక్ష్మి, జె. లీలా, టీ పార్వతి, టి.సుబ్బమ్మ, చంద్రమతి, శ్రీలక్ష్మి, జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

నేడు మేదరమెట్లలో మంత్రి పర్యటన

మేదరమెట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు కార్యక్రమాలల్లో పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మేదరమెట్లలో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం, ఎస్టీ కాలనీలో కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన, సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేయనున్నారు.

సాగు.. తారుమారు

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ప్రభావం చూపాయి. పైగా పంటకు మార్కెట్‌లో ధర లభించలేదు. ధర పతనమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మిరప సాగుకు వేలాది మంది రైతులు దూరమయ్యారు. గత ఏడాది మూడు జిల్లాల్లో 1,71,226 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది 1,15,422 ఎకరాలకు మిరప సాగు పరిమితమైనట్లు ఉద్యాన శాఖ గణాంకాలు చెబుతున్నాయి. క్రితం సారి కన్నా దాదాపు 55,804 ఎకరాల్లో మిరప సాగు తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పాటు నల్ల తామరతో దిగుబడులు తగ్గడంతో నష్టపోయిన రైతులు ఈ సారి మిరప సాగుకు దూరమయ్యారు. మార్కెట్‌లో మిరప క్వింటాల్ రూ.12 వేల నుంచి రూ.13 వేలు ఉందని రైతులు చెబుతున్నారు. క్రితం సంవత్సరం కన్నా క్వింటాకు రూ.6 వేల వరకు ధర తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మిరపకు ధర కల్పించాలని సీఎం చంద్రబాబును రైతుల పక్షాన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో సాయం అందిస్తుందని మిరప రైతులు ఆశపడుతున్నారు.

గణనీయంగా పెరిగిన మొక్కజొన్న.. పొగాకు సాగు

మిరప గిట్టుబాటు కాకపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. దీంతో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలను తారుమారు చేస్తూ గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడు పొగాకు సాగు పెరిగింది. మిరపతో పాటు శనగ సాగు కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది శనగ కలిసిరాకపోవడంతో మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు.

అన్న క్యాంటీన్‌లో మందుబాబులకు నో ఎంట్రీ

రూ.5లకే పేదల ఆకలి తీర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే కొందరు మద్యం సేవించి క్యాంటీన్‌కి వచ్చి సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై నిర్వాహకులు కొన్ని నిబంధనలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. మద్యం సేవించి వచ్చేవారికి క్యాంటిన్‌లో ప్రవేశం లేదనే బోర్డును ఏర్పాటు చేశారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటిన్‌లో ఇలా బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో నగరంలోని అన్నీ అన్న క్యాంటీన్‌లలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

సాగర్ కాలువపై ప్రమాదకరంగా బ్రిడ్జిలు

» పడిపోయిన రక్షణ గోడలు
» కాలువ పక్కన రోడ్డుపై భయంకరంగా మలుపులు, గుంతలు
» ఏళ్లతరబడి ఇదే తంతు » ఇకనైనా మరమ్మతులు చేయరా?

మార్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ జవహర్ కాలువ మార్టూరు మండల పరిధిలో కోనంకి సబ్‌డివిజన్ పరిధిలో సాగర్ కాలువపై ప్రమాదకరమైన పరిస్థితులలో బ్రిడ్జిలు ఉన్నాయి. ఎంతో కాలం నుంచి ఈ బ్రిడ్జిలకు రక్షణ గోడలు లేకపోయినా, పడిపోయినా వాటి మరమ్మతులకు ఆయా ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయలేదు. దానికితోడు సాగర్ కాలువ పక్కనే ఉన్న తారురోడ్డుపై అక్కడక్కడా ప్రమాదకరైన గుంతలు ఏర్పడినా, వాహనాలు అదుపుతప్పితే పక్కనే ఉన్న సాగర్ కాలువలోకి వాహనాలు దూసుకుపోయే అవకాశం ఉన్నా రక్షణచర్యలు చేపట్టేవారు కరువయ్యారు. కాలువపై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిలు గతంలో రైతువారీ అవసరాలు కోసం అప్పటి నాయకులు సహకారంతో ఏర్పాటు చేసినవి. ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలు నిమిత్తం, రవాణా సౌకర్యాలుగా వివిధ వాహనదారులు ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు కూడా ఈ బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తప్పని సరిగా టీడీపీ కూటమి ప్రభుత్వమైనా సాగర్ కాలువపై ఉన్న బ్రిడ్జిల మరమ్మతులకు, రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.



వలపర్ల - రామకూరు మధ్య సాగర్ కాలువపై ప్రమాదకరంగా రక్షణ గోడలు లేకుండా ఉన్న 36-3 బ్రిడ్జి

ప్రమాదకరమైన వలపర్ల - రామకూరు 36-3 బ్రిడ్జి

రెండు మండలాలకు, రెండు గ్రామాలకు వారధిగా సాగర్ కాలువపై మార్టూరు మండలం వలపర్ల జె.పంగులూరు మండలం రామకూరు గ్రామాల మధ్య 36-3 బ్రిడ్జి ప్రజల రాకపోకలకు, వాహనాలు ప్రయాణానికి ప్రమాదకరంగా ఉంది. అద్దంకి డిపో నుంచి ఆర్టీసీ బస్సులు వలపర్ల మీదగా చిలకలూరిపేట, ఇంకొల్లు వెళ్లేందుకు ఈ బ్రిడ్జిపై నుంచి ప్రమాదకరంగా రోజూ ప్రయాణం చేస్తుంటాయి. ఇక రైతువారీ రోజూ ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు అధికంగా ఉంటారు. గతంలో ఈ బ్రిడ్జిపై నుంచి వాహనదారులు సాగర్ కాలువలో పడిపోయిన సందర్భాలు ఉన్నాయి.

లక్కవరం 37-3 బ్రిడ్జిపై తరచూ ప్రమాదాలు

యద్దనపూడి బ్రాంచి కెనాల్‌పై పమిడిపాడు మేజరు వద్ద బొల్లాపల్లి టోల్‌ప్లాజా వైపు నుంచి లక్కవరం, రామకూరు గ్రామాలకు వెళ్లేందుకు 37-3 బ్రిడ్జిని దాటి వెళ్లాల్సిందే. ఈ బ్రిడ్జిమీద ప్రయాణం అత్యంత ప్రమాదకరం. కనీసం బ్రిడ్జిపై 10 అడుగుల దూరం కూడా రోడ్డు వెడల్పు ఉండదు. దాంతో ఏ మాత్రం వాహనదారుడు అప్రమత్తంగా ఉంటే వాహనం సాగర్ కాలువలో పడిపోతుంది. గతంలో ఒక ట్రాక్టరు సాగర్ కాలువలో పడిపోవడంతో ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. రాత్రి సమయాలలో ఈ బ్రిడ్జిపై ప్రయాణం మరింతప్రమాదంగా ఉంటుంది. ఇంకా చిమ్మిరిబండ, ద్రోణాదుల గ్రామాల మధ్య నూతలపాడు మైనరు కాల్వపై కూడా రక్షణ గోడలు లేక బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. ద్రోణాదుల గ్రామంలో నాగండ్ల వెళ్లే రోడ్డులో మైనరు కాల్వపై ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎక్కువగా ద్విచక్రవాహనదారులు, పశువులు కాలువలో పడిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ప్రయాణం ప్రమాదకరం

సాగర్ కాలువ పక్కనే ఉన్న తారురోడ్డులో ఎక్కువగా కంకర లారీలు, ట్రాక్టర్లు రోజూ తిరుగుతుండడంతో రోడ్డుపై గుంతలు పడుతున్నాయి. వాటిని గమనించకుండా వెళ్లే ద్విచక్రవాహనదారులు, కార్లు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నాయి. బొల్లాపల్లి జీఎన్‌టి రోడ్డుకు వలపర్ల, లక్కవరం, రామకూరు గ్రామాల నుంచి కార్లలో ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులోనే ప్రమాదకరంగా, వెడల్పు తక్కువగా ఉన్న రోడ్డు మలుపు ఉంది. అక్కడ పట్టపగలు ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఈ మలుపు వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రోడ్డు పక్కన ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో



లక్కవరం వెళ్లే దారిలో కాలువపై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

సాగర్ నీటిలోకి వాహనాలు పడిపోయే అవకాశం ఉంది. సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగర్ నీరు సక్రమంగా అందకపోవడం, కోనంకి ఎన్నెస్పీ పరిధిలో కాలువకు సమృద్ధిగా నీళ్ల రాకపోవడంతో అడపాదడపా ప్రమాదాలు జరిగినా కాలువలో భారీ స్థాయిలో నీటి ప్రవాహనం లేకపోవడంతో చాలా మంది ప్రాణాలతో బయటపడిన సందర్భాలు ఉన్నాయి.



ద్రోణాదుల మేజర్ కాలువపై చిమ్మిరిబండ వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



బొల్లాపల్లి నుంచి లక్కవరం వైపు వెళ్లే రోడ్డులో ఏర్పడిన భారీ గుంత



బొల్లాపల్లి జీఎన్‌టి సమీపంలో సాగర్ కాలువ పక్కనే రోడ్డుపై రక్షణ లేకుండా ఉన్న ప్రమాదకరమైన మలుపు

మన ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మన ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు.

సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్యార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.జగదీష్ తెలిపారు. గురువారం కళాశాలలో 15 మినిట్స్ ఆఫ్ సిటీ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి, ఎస్ఐటీ రీసెర్చ్ స్కాలర్ అనిల్ రాజ్ కుమార్ హాజరై ఉపన్యసించారు. ప్రతి వ్యక్తి ఇంటి నుంచి 15 నిమిషాలలో స్కూల్స్, హాస్పిటల్స్, మార్కెట్స్, పార్క్‌లు ఇతర అవసరాలు పొందగలగడం వలన ట్రాఫిక్, కాలుష్యం వివిధ రకాల హానికర వంటి వాటని నియంత్రించవచ్చన్నారు. జనాభా పెరుగుతున్న క్రమంలో జీవన మనుగడకు ప్రతి ఒక్కరూ మార్గాలకు బాటలు వేయాలన్నారు. అనంతరం స్కాలర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి విజయ, కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థి అనిల్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో ఎర్రయ్య

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్నిరంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని జిల్లా డీఐఈవో ఎర్రయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 23వ వార్షికోత్సవం వేడుకలు ప్రిన్సిపాల్ స్నేహలత ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 2024-25 కళాశాల ప్రగతిని కొనియాడారు. విద్యా హక్కులు. మనుగడ తదితర అంశాలను వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మురళి, ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు ధైర్యంతో మెలగాలన్నారు. సమస్యలు ఉన్నప్పుడు తెలివితో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మారెడ్డి, రాఘవరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ న్యాయాధికారి రామకృష్ణపై ఫిర్యాదు



సీఐ సుబ్బరాజుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

అద్దంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని ఒక ఇంటర్వ్యూలో అసభ్యపదజాలంతో మాట్లాడిన విశ్రాంత న్యాయాధికారి రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరాజుకు గురువారం అద్దంకి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మందా ఆమోసు, పూనూరి నరేంద్ర సీఐ సుబ్బరాజుకు ఫిర్యాదు చేశారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

మేదరమెట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పర్యవేక్షణ కోరకు దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం మేదరమెట్లలో సెంటర్‌లో బిగిస్తున్న సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు.



మేదరమెట్లలో సీసీ కెమెరాల ఏర్పాటుపై మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్ రఫీ, సింథైట్ ప్రతినిధులు

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మొత్తం 40 సీసీ కెమెరాలను బిగిస్తున్నామన్నారు. అద్దంకి రూరల్ కూడలి (పైలాన్ సెంటర్), రావినూతల రోడ్డు, గుంటూరు రోడ్డు, గ్రామంలోని ప్రధాన కూడలీలలో సీసీ కెమెరాలను బిగిస్తున్నాట్లు తెలిపారు. సింథైట్ కంపెనీ సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో సింథైట్ ప్రతినిధులు అబ్దుల్ సాలామ్, జయరామన్, పోలీస్ బృంది పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు

» దేశంలో తొలిసారిగా వాట్సాప్‌తో సేవలు
» 161 రకాల పౌరసేవలను అందించేందుకు శ్రీకారం
» 9552300009 నెంబర్‌ను కేటాయించిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రజలకు సత్వర పౌరసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు చర్యలు తీసుకున్నారు. ఈ సేవలను ప్రజలు సత్వరం పొందేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అధికారిక వాట్సాప్ నెంబరు 9552300009 నెంబర్‌ను ప్రకటించి లాచనంగా ప్రారంభించారు. ప్రజలకు పౌరసేవలు అందివ్వడంతోపాటు ప్రజల నుంచి వినతులు కూడా స్వీకరించి వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. తొలిదశలో మొత్తం 161 రకాల పౌరసేవలను అందించనుంది. దేవదాయ, ఇంధన, ఏపీ ఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మునిసిపల్ శాఖల్లో ఈ సేవలు ప్రారంభమవుతాయి. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వాట్సాప్ ద్వారానే పొందే విధంగా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇంకొకవైపు ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు కూడా ఈ వాట్సాప్‌నే వినియోగిస్తుంది. ప్రజలు ఏదైనా ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే ఈ నెంబర్‌కు మేసేజ్ చేస్తే వెంటనే వారికి ఒక లింక్ వస్తోంది. అందులో సంబంధిత వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, చిరునామా పొందుపరిస్తే సరిపోతుంది. వెంటనే వారికి రిఫరెన్స్ నెంబర్ కూడా వస్తుంది. దాని ఆధారంగా తాము ఇచ్చిన వినతి పరిష్కారం ఎంతవరకు వచ్చింది, ఎవరి వద్ద ఉందనేది కూడా తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు. మరోవైపు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అర్హతలు, పథకాల లబ్ధిపై కూడా ఈ వాట్సాప్ నెంబర్‌కు మేసేజ్ చేసి తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

విద్యుత్ బిల్లులు, పన్నులు చెల్లింపు

కాగా ఈ వాట్సాప్ ద్వారా విద్యుత్ బిల్లులు, ఆస్తిపన్నులు చెల్లించవచ్చు, ట్రేడ్ లైసెన్సులు కూడా పొందేందుకు అవకాశం కల్పించారు. దేవాలయాల్లో దర్శనాల స్లాట్ బుకింగ్, వసతి బుకింగ్, విరాళాలు పంపడం వంటివి చేయవచ్చు, రెవెన్యూ శాఖకు సంబంధించిన ల్యాండ్ రికార్డుల యాక్సెస్, వివిధ సర్టిఫికెట్లను కూడా పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ప్రతి ఒక్కరికి వద్ద సెల్‌ఫోన్

కాగా ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద స్మార్ట్ సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. ఆ ఫోన్ ద్వారానే ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం కూడా సులభతరం చేసింది. ఏ సమయంలోనైనా తమ సమస్యలను ఆ వాట్సాప్ ద్వారా చేస్తే వెంటనే ఆ సమాచారాన్ని సంబంధిత అధికారుల వద్దకు చేరుతుంది. తద్వారా సత్వరమే పౌరసేవలు పొందేందుకు ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేస్తుంది.

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటిలో ఇరువురు తొలగింపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వరరెడ్డిలను ఆ పదవుల నుంచి తొలగించారు. ఆ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ సీఈవో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎకె. ఫరీదా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల నకలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్‌కు పంపారు.

మంగళగిరి చేనేతకు జీవం

(5వ పేజీ తరువాయి)

కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ చేనేతపార్కుతో మంగళగిరిలో మళ్లీ చేనేతకు కొత్తజీవం పోసుకోబోతుందనడంలో సందేహం లేదు. చేనేతపార్కు అంటే...పచ్చి నూలు మొదలు చీర తయారీ మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ఇక్కడి నుంచే ఏర్పాటు చేస్తారు. మంగళగిరి వస్త్రాలకు గిరాకీ పెంచే ఉద్దేశ్యతో కంచి చేనేతపార్కు తరహాలో దీనికి సిల్కును కూడా జోడించాలని మంత్రి సవిత సూచించారు.

ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400

మంగళగిరిలో ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400. రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో ఆరు భారీ షెడ్లను ఏర్పాటుచేసి 146 ఫ్రేమ్ మగ్గాలను నేత కార్మికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రత్నాలచెరువులో 520 మగ్గాలు, ఇందిరానగర్, పాతమంగళగిరి కలిపి 350 మగ్గాలు, ఆత్మకూరులో 60, ఎర్రబాలెంలో 225, తాడేపల్లిలో ఎనిమిది, చినకాకానిలో 20, కాజలో ఆరు, నవులూరులో సుమారు వంద వరకు మగ్గాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు కాబోతున్న మెగా చేనేతపార్కులో వేయికిపైగా ఫ్రేమ్ మగ్గాలను ఏర్పాటుచేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ పార్కు ఏర్పాటుతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సుమారు ఐదారు వేలమందికి ఉపాధి కలగనుంది. ఇక ఈ పార్కులో యారన్ డిపో, అడ్మినిస్ట్రేటివ్, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనాలు, డిస్పెన్సరీ, క్యాంటీన్, కాఫీషాపు, మార్కెటింగ్ కాంప్లెక్స్, వర్క్‌షాపు, వేర్ హౌస్, కాన్ఫరెన్స్‌హాలు, ఆడియో వీడియో సెంటర్, విశ్రాంతి భవనం, వేబ్రిడ్జి, సెక్యూరిటీ భవనం, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్, ఎక్విప్‌మెంట్ అండ్ ఫర్నిచర్ ఫర్ టెస్టింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సిల్క్ ఈటీపి, కాటన్ ఈటీపీ తదితరాలను ఏర్పాటు చేస్తారు.

చీరాల రైల్వే స్టేషన్‌కు సొబగులు

- సుమారు రూ.17కోట్ల నిధులతో స్టేషన్‌లో ఆధునికీకరణ
- ఏడాదిగా జరుగుతున్న పనులు
- త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికుల విజ్ఞప్తి

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ రైల్వే మౌలిక వసతుల కల్పనతో భారీ పరివర్తన దిశతో పురోగమిస్తుంది. ఈక్రమంలోనే చీరాల రైల్వే స్టేషన్‌కు మహర్దశ రానుంది. సుమారు రూ17కోట్ల అమృత్ భారత్ సర్కార్ స్కీం ద్వారా చీరాల స్టేషన్లఓ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. రెండు ఎక్స్‌లేటర్ సుమారు 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు షెడ్లు, పెయిడ్ విశ్రాంతి గదులు, మరుగు దొడ్లు, పార్క్, ఫ్లోరింగ్ వంటి పనులు సుమారు ఏడాదిగా సాగుతున్నాయి. ఇప్పుడు జరుగుతున్న ఆధునికీకరణతో రైల్వేకు చీరాల నుంచి మరింత ఆదాయంతో పాటు మెరుగైన సేవలు అందుతాయని అధికారులు, ప్రజలు భావిస్తున్నారు. అయితే నిర్మాణాలు ఇప్పటికే సంవత్సర కాలం నుంచి జరుగుతున్నాయి. మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. గురువారం స్థానిక అభివృద్ధి కమిటి ప్రతినిధులు పనులను పర్యవేక్షించారు. ఈక్రమంలో ప్రస్తుతం స్టేషన్‌లో ఫ్లోర్ అస్తవ్యస్తంగా ఉంది. నిత్యం దుమ్ముధూళితో ఉంటోంది. ఈక్రమంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు వేగంగా పూర్తి చే యాలని కోరుకుంటున్నారు.


స్టేషన్‌లో జరుగుతున్న ఎక్స్‌లేటర్ నిర్మాణం


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు


చీరాల రైల్వే స్టేషన్

అభివృద్ధి పనులతో అందరికీ సౌకర్యాలు



గత ఏడాది కాలంగా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరో ఏడాది జరిగే అవకాశం ఉంది. ఆధునీకరణతో స్టేషన్ సుందరంగా ఉంటుంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఉంటాయి.

- భరణి, అభివృద్ధి కమిటీ సభ్యులు

పనులు వేగంగా పూర్తి చేస్తాం



స్టేషన్‌లో పనులు జరుగుతుండగా కొంత అసౌకర్యం జరుగుతున్నది వాస్తవమే. అయితే ఆధునీకరణ వలన ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయి. ప్ర భుత్వానికి ఆదాయం ఉంటుంది. ప్రజలకు సేవలు అందుతాయి.

- నల్లగొర్ల సింగయ్య, స్టేషన్ సూపరింటెండెంట్



పౌరహక్కుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శివశ్రీను

ప్రతి వ్యక్తికీ సమాన పౌరహక్కులు

పంగులూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మనుషులంతా ఒకటేనని, భారత రాజ్యాంగం ప్రతి వ్యక్తికీ పౌరహక్కులను సమానంగా కల్పించిందని డిప్యూటీ తహసీల్దార్ శివశ్రీను అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శివశ్రీను మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో నెలకొన్న అంతరాలు తొలగిపోతాయన్నారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి చదువులు కొనసాగించాలని కోరారు. అంటరానితనం నేరమనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని హాస్టల్ వార్డెన్ వీరాస్వామి అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు చింపారావు, గ్రేస్‌పావని, మహిళా పోలీస్ గద్దె అరుణ, ఏఎన్‌ఎం ఎస్తేర్‌రాణి, కార్యాలయ సిబ్బంది పీటర్, శరత్, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

వయోజనులకు అక్షరజ్ఞానం అందించాలి

పంగులూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో నిరక్షరాస్యులైన ప్రతివ్యక్తినీ సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు మహిళా వలంటీర్లు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంఈవో వీరాంజనేయులు కోరారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో గురువారం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చేపట్టాల్సిన అక్షరాస్యత అంశాలపై మహిళా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వయోజన విద్య సూపర్ వైజర్ జ్యోతి, వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్, సీసీలు ఎస్‌హెచ్ గ్రూప్ వలంటీర్లు పాల్గొన్నారు.

సదరమ్ సర్టిఫికెట్ అందించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, బాధిత మహిళ

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అర్హురాలైన మహిళకు సదరమ్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను కోరారు. పట్టణానికి చెందిన కుంచాల కృష్ణవేణి పుట్టుకతోనే ఓ కంటిని కోల్పోయారు. ఈక్రమంలో దాదాపుగా 10ఏళ్లుగా పెన్షన్ అందుకుంటుంది. అయితే ఇటీవల సదరమ్ వెరిఫికేషన్‌లో భాగంగా చీరాల ఏరియా హాస్పిటల్ వైద్యులు ఆమెకు ధ్రువపత్రాన్ని ఆటంకం వ్యక్తం చేశారు. దీంతో జరిగిన ఘటనపై చిన్నపాటి వివాదం నెలకొంది. దీంతో టీడీపీ నాయకులు పట్టణంలో ఆందోళన చేశారు. అలాగే అర్హురాలికి సర్టిఫికెట్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైన్ షాపుల చోరీ కేసులో పోలీసులకు కీలక సమాచారం

అద్దంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులలో చోరీలకు పాల్పడిన కేసులకు సంబంధించి పోలీసులకు కీలక సమాచారం లభించినట్లు సమాచారం. సోమవారం అర్ధరాత్రిదాటిన తరువాత అద్దంకి మండలం శాంతినగర్ వద్ద మారుతీ వైన్స్, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు వద్ద అంకమ్మతల్లి వైన్స్ షాప్‌ల్లో చోరీలు జరిగాయి. పెద్ద మొత్తంలో కాస్ట్లీ మద్యం చోరీకి గురైంది. వి.కొప్పెరపాడు వద్ద వాచ్‌మన్‌ను బెదిరించి చోరీకి పాల్పడ్డాడు. కారులో వచ్చిన 8 మంది చోరీకి పాల్పడినట్లు వాచ్‌మన్ సమాచారం ఇవ్వడంతో ఆ కోణంలో అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో వినుకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు కీలక సమాచారం రావడంతో ఆ కోణంలో విచారిస్తున్నారు. చోరీకి పాల్పడ్డ మద్యాన్ని కూడా గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. పోలీసులు వెంటనే స్పందించడంతో కీలక సమాచారం లభించినట్లు తెలుస్తుంది. దీంతో దొంగలించబడ్డ మద్యం లో కొంత భాగం దొంగలు తాగినప్పటికీ అత్యధిక శాతం రికవరీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.


శాంతినగర్ వద్ద చోరీ జరిగిన మారుతీ వైన్ షాపు వద్ద విచారిస్తున్న సీఐ సుబ్బరాజు (ఫైల్)

గాంధీజీకి ఘన నివాళి


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ, వాసవీ వనితా సభ్యులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలని పలువురు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు గురువారం వేటపాలెం మండలం పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దోగుపర్తి బాలకృష్ణ, పల్లప్రోలు శ్రీనివాసరావు, నాగుఆవుల అశోక్ పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : సత్యం, అసింస గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య, షేక్ మహమ్మద్ రఫీ, శ్రీనివాసరవు, దివాకర్‌దత్తు, దేవపాలన, చంద్రమౌళి, గురు శేఖర్, అంజాద్ బాషా, మలాది శ్రీనివాసరావు, అంజనేయులు, శ్రీలక్ష్మిశి వకుమారి, ఉమ అన్నపూర్ణ పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని చెన్నుపల్లి గ్రామ సచివాలయంలో జాతిపిత మహాత్మా గాంధీకి ఉద్యోగులు నివాళులర్పించారు. గాంధీజీ వర్ధం తి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ వజ్రయ్య పాల్గొన్నారు.

పర్చూరు : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి తహసీల్దార్ బ్రహ్మయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడిపాక హరిప్రసాద్, నారాయణ, అజ య్, సిద్ధయ్య, బుజ్జి, పే ర్ని హరి, కొత్తూరు శ్రీను పాల్గొన్నారు.

చినగంజాం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి టీడీపీ బా పట్ల పార్లమెంట్ వాణి జ్య విభాగ ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ వనితా సభ్యులు, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనితా మండల అధ్యక్షుడు వేదాల కృష్ణకుమారి, కార్యదర్శి మోటుమర్రి శేషకుమారి, కోశాధికారి అమరా నాగలక్ష్మీ, కేబినెట్ కోశాధికారి పొట్టి శైలజ, ఫాస్ట్ అధ్యక్షుడు కోటా సుచిత్ర, సభ్యులు సులోచన, మీనా, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, శ్రీనివాస దీక్షితులు, గంటా అంకమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, టీడీపీ నాయకులు టీ.జయరావు, భయ్యా సతీష్‌కుమార్, ఘంటా నరసింహారావు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


వేటపాలెంలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్నటీడీపీ కూటమి నాయకులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్య

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చినగంజాం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కారంచేడు ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల వారు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో చిన్నారులు, పెద్దవాళ్లకు కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని, అర్హులైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

7లోపు దరఖాస్తు చేసుకోండి

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో రుణ సౌకర్యాన్ని పొందేందుకు లబ్ధిదారులు ఈ నెల 7వతేదీలోపు వారి గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో బీసీలకు రూ.31లక్షలతో 16 యూనిట్లు, ఈబీసీలకు రూ.14లక్షలతో 8 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.



కేజీబీవీలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

విద్యార్థులకు అందుతున్న వసతులపై తనిఖీలు

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వచ్చిన ప్రత్యేక టీంలు గత మూడు రోజుల నుంచి తనిఖీలు చేస్తున్నాయి. బల్లికురవ మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఉన్నతాధికారులు గుర్తించి అక్కడ విద్యార్థినులకు అందుతున్న వసతులు వారి ఇబ్బందులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆడిట్ టీంలను పంపించారు. గురువారం కేజీబీవీ విద్యాలయంలో తనిఖీల అనంతరం ఆడిట్ బృందం బాలికల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులు మీ పిల్లలకు ఎలా అందుతున్నాయన్న దానిపై అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా మొత్తం మీద 35 పాఠశాలలో ఈ తనిఖీలను చేస్తున్నట్లు టీం సభ్యులు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని 50 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళను రైలు ఢీకొంది. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మేజర్ కాలువకు గండి

- గుర్తు తెలియని రైతుల నిర్వాకం
- గుంటుపల్లి మేజర్‌లో ఆయకట్టుకు అందని నీరు
- పూడ్పించిన డీసీ వైస్ చైర్మన్ పేరయ్య


గండిని పూడ్చిస్తున్న డీసీ వైస్ చైర్మన్ పేరయ్య, ఎన్‌ఎస్పీ సిబ్బంది


గుంటుపల్లి మేజర్ కాలువకు పెట్టిన గండి

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కెనాల్ నుంచి చీలే గుంటుపల్లి మేజర్ కాలువకు గుంటుపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైతులు రాత్రి సమయంలో గండిని పెట్టి నీటిని దిగువ భూములకు రాకుండా చేశారు. దీంతో ఆయకట్టులో ఉన్న భూములకు చుక్క నీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మెదలైంది. ఈ విషయం కొందరు రైతులు నీటి సంఘం డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య దృష్టికి తీసుకు వచ్చారు. గురువారం డీసీ వైస్ చైర్మన్ ఎన్‌ఎస్పీ సిబ్బంది హుటాహుటీన గండి పెట్టిన ప్రాంతానికి తీసుకొచ్చి ఇసుక మూటలను తెప్పించి గండిని పూ డ్చించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్పీ సిబ్బంది రైతులతో మాట్లాడుతూ కాలువకు గండి ఎక్కడ పెడితే అక్కడ ఉన్న భూమికి చెందిన రైతులపై చర్యలు తప్పవన్నారు. గుంటుపల్లి మేజర్ కాలువ పరిధిలో ఆరు గ్రామాలకు సాగు నీరు చేరాల్సి ఉందన్నారు. రైతులు అందరూ సమన్వయంతో సాగు నీటిని పంటలకు వినియెగించుకోవాలన్నారు. గండిని పూడ్పించేందుకు వెంటనే స్పందించిన డీసీ వైస్ చైర్మన్ పేరయ్యను దిగువ భూములకు చెందిన రైతులు అభినందించారు.


ధ్వజస్తంబ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పర్చూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో నూతనంగా నిర్మించిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంబాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. రుత్వికులు ప్రత్యేక పూజా కార్యక్రమాల నడుమ ధ్వజస్తంబాన్ని ఏర్పాటు చేశారు. నేడు శ్రీ మహా గణపతి, సబ్రహ్మణ్య, ఆంజనేయ, అష్టలక్ష్మి దేవతా మూర్తి విగ్రహాల ప్రతిష్ఠకు సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ, విజయానంద తీర్థస్వామి హాజరవుతున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సత్వరమే అందేలా అధికారులు పనిచేయాలని ప్రత్యేకాధికారి శ్రీనివాసులు కోరారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలంలో సచివాలయ ఉద్యోగులు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుండే అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చేతి పంపులను మర్మతులు చేయించి, స్టోరేజీ చెరువులకు నీటిని నింపాలన్నారు. అలానే అంటు వ్యాధులు రాకుండా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియెగంలోకి తీసుకు రావాలన్నారు. అలానే ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక యాప్‌లో ప్రజల వివరాలను నమోదు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె. కుసుమకుమారి, ఈవోపీఆర్డీ సుమతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ పాల్గొన్నారు.

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సంఘటితంగా పోరాడితేనే దివ్యాంగుల సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు ఎల్‌ఐసీ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం ఎల్‌ఐసీ కార్యాలయంలో రాష్ట్ర దివ్యాంగుల ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అలాగే ఇటీవల స్థానికంగా పనిచేస్తున్న భూపతి నాగేశ్వరరావు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రటరీ రామిరెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సారా తయారీ స్థావరంపై దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అక్కాయిపాలెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద చీరాల ఎక్సైజ్ శాఖ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నాటుసారా తయారీ స్థావరాన్ని గుర్తించి 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్సై శ్రీహరి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

బల్లికురవ జూనియర్ కళాశాల వార్షికోత్సవ సభలో ఎస్ఐ

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట లక్ష్యంతో కష్టపడి చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్ఐ జీవీ చౌదరి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపాల్ కె.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇంటర్ విద్య అంటే విద్యార్థుల భవిష్యత్‌కు పునాది అని ప్రతిఒక్కరూ గుర్తెరిగి చక్కగా చదుకోవాలన్నారు. చదువు ఉంటేనే కుటుంబాలు ఆనందంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం విద్యా ర్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించేలా తాము శాయ శక్తులా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు విద్యార్థులు హాస్య నాటికలతో ఆనందపరిచారు.సభలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, కె.హనుమంతురావు, కేబీ వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగరాజ, హరిహరన్‌రెడ్డి పాల్గొన్నారు.



కళాశాల వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎస్ఐ జీవీ చౌదరి



నెల్లూరు : కనకమహల్ సెంటర్ వద్ద సుందరయ్య విగ్రహం చుట్టూ సీపీఎం జెండాల రెపరెపలు

కమ్యూనిస్టుల పురిటిగడ్డపై

మహా సంబరం!

- రేపటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు
- ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లు సింహపురి
- నాటి పుచ్చలపల్లి నుంచి నిన్నటి జక్కా వెంకయ్య వరకు..
- ఆస్తులు వదులుకున్న ఎందరో త్యాగధనులు

ఉద్యమాల జిల్లా.. కమ్యూనిస్టు యోధుల పురిటిగడ్డ సింహపురి మహా సంబరానికి వేదిక కానుంది. నలభై ఐదేళ్ల తర్వాత నెల్లూరులో ఆ పార్టీ రాష్ట్ర మహాసభలు శనివారం నుంచి జరగనున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సభలకు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు తరలిరానున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత జరగనున్న ఈ సభలను విజయవంతం చేసేందుకు సీపీఎం శ్రేణులు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇప్పటికే ప్రజానాట్యమండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జనసమీకరణ చేపట్టారు. కాగా, ఎన్నో ఉద్యమాలు పురుడుపోసుకున్న సింహపురిలో సీపీఎం ప్రాభవంపై ప్రత్యేక కథనం...

వివరాలు 6లో

గాంధీ మార్గాన్ని అనుసరిద్దాం

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ పిలుపు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సత్యం, ధర్మం, అహింస, సత్యాగ్రహం వంటి ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడు గాంధీజీ అని, ఆయన చూపిన శాంతిమార్గంలో మనమందరం నడుద్దామని ఇన్చార్జి కలెక్టర్ కే.కార్తీక్ అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ యావత్ భారతావనికి స్వేచ్ఛావాయువులు ప్రసాదించిన జాతి మార్గదర్శకుడు గాంధీజీ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మన జాతిపిత అనుసరించిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, ఐఅండ్‌పీఆర్ డీడీ సదారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో

ఇక అంతా సెన్సార్లే!

- ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్‌కు సర్వం సిద్ధం

నెల్లూరు (క్రైం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు అధికారుల కనుసన్నల్లో జరిగిన డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ ఇకపై కెమెరాలు, సెన్సార్ల నిఘాలో ఉండబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను రవాణా శాఖ సిద్ధం చేస్తోంది. తొలివిడతగా మొదటి విడతగా చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విజయవాడ ప్రాంతాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2వ విడతలో నెల్లూరును ఎంపిక చేశారు. నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ట్రాక్‌లో మొత్తం 13 సెన్సార్లు, 14 వీడియో కెమెరాలు, 8 వీఎంఎస్ బోర్డులు అమర్చారు. అలాగే సెన్సార్లతో కూడిన బెల్లెట్లను వాహనం తిరిగే మలుపుల్లో పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. రూ.1.21 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన నిపుణ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ట్రాక్ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తి చేసిన రవాణా శాఖ అధికారులు 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫిబ్రవరి 1వ తేది నుంచి నగరంలోని డీటీసీ కార్యాలయంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తయింది. డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చే వారంతా ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌లోనే వాహనాలను డ్రైవ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మాత్రం గతంలోలాగే.

- జి. చందర్, డీటీసీ





రూపుదిద్దుకున్న ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, డిజిటల్ ట్రాక్ స్తంభాలు (ఇన్‌సెట్‌లో)

- అంతా ఆటోమేటిక్...

ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ఆధునిక టెక్నాలజీతో నిర్మించారు. గతంలోలా డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చిన వారు అధికారుల పర్యవేక్షణలో వాహనాలు నడిపి లైసెన్సులు పొందేవారు. ఇప్పుడు అలా కుదరదు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చినవారు ముందుగా ట్రాక్ ఆవరణలో ఉన్న కియోస్క్ యంత్రంలో వేలిముద్ర వేయాలి. ఆ వెంటనే ఓ టోకెన్ వస్తుంది. ఆ టోకెన్ తీసుకొని ట్రాక్‌లోకి వెళ్లాలి. బైక్, ఆటో, కారు డ్రైవింగ్ టెస్ట్ కోసం వచ్చిన వారికి ఆయా వాహనాలకు సంబంధించిన రూట్లను సిబ్బంది చూపిస్తారు. ట్రాక్‌లోకి ప్రవేశించగానే అక్కడున్న సెన్సార్ వద్ద టోకెన్‌ను స్కాన్ చేయాలి. ట్రాక్‌పై ఉంచిన వీఎంఎస్ బోర్డుపై గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దరఖాస్తు ప్రక్రియలో తప్పులు ఉంటే రెడ్ సిగ్నల్ వస్తుంది. గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత లైసెన్స్ కోసం వచ్చిన అభ్యర్థి సూచిక బోర్డుల ఆధారంగా వాహనం నడపాలి. ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సెన్సార్లు, బెల్లెట్లకు కాలు తగిలినా, కాలు కింద మోపినా వీఎంఎస్ బోర్డులో ఫెయిల్ అని వస్తుంది. ఈ ప్రక్రియను రవాణాశాఖ అధికారులతో పాటు ప్రైవేటు కంపెనీకి చెందిన ప్రతినిధులు పరిశీలిస్తుంటారు.

డిప్యూటీ మేయర్

ఎన్నికపై కసరత్తు

- 3వ తేదీన ఎన్నిక
- ముస్లింలకే కేటాయించాలన్న టీడీపీ అధిష్ఠానం
- పోటీకి మేమూ సిద్ధమంటున్న వైసీపీ

నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ సిద్ధమవుతున్నాయి. మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో కార్పొరేషన్‌లో టీడీపీ సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నా, వైసీపీకి గెలిచే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నా.. పోటీ మాత్రం అనివార్యం కానుంది. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా వైసీపీ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. విశేషమేమంటే రెండు పార్టీలు ముస్లిం మైనారిటీ అభ్యర్థులనే రంగంలోకి దించనున్నాయి.

- వివరాలు 6లో

రిజిస్ట్రేషన్లకు సర్వర్ డౌన్!

- రూ.కోట్ల ఆదాయానికి గండి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సర్వర్ గురువారం మొరాయించింది. దీంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడగా, ఆ శాఖ ఆదాయానికి గండి పడింది. సాధారణంగా రోజుకు రూ.కోటి నుంచి రూ.ఒకటిన్నర కోటి వరకు ఈ శాఖకు ఆదాయం వస్తుంది. అయితే, తరచూ సర్వర్ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగి ఈసీలు, నకళ్లు రావడం లేదు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల విలువలు పెరుగుతాయని ప్రభుత్వం ప్రకటించడంతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారి సంఖ్య సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు భారీగా పెరిగింది. గురువారం సర్వర్ పని చేయకపోవడంతో అంతా వెనుతిరిగారు. శుక్రవారమైనా సర్వర్ పని చేస్తుందా అనే ఆందోళన నెలకొంది. శనివారం నుంచి భూములు, స్థలాల మార్కెట్ విలువలు పెరగనుండటంతో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొంతమేర రిజిస్ట్రేషన్ విలువల భారం తగ్గుతుందని జనం భావిస్తూ సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాలకు చేరుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వర్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- అల్లూరు : సర్వర్ మొరాయించడంతో అల్లూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమైంది. తొలుత పీడీఈ సర్వర్ మొరాయించడంతో సమస్య తీవ్రతరమైంది. అదేవిధంగా కార్యాలయంలో పీడీఈ వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన కక్షిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

అంగన్వాడీల

మరో పోరుబాట

- సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం
- వచ్చే నెల 17 నుంచి ఆందోళనకు శ్రీకారం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారికి ఆటపాటలతో పాటు, విద్యాబుద్ధులు నేర్పించే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుగుబొదుగూ లేని వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ వారు వాపోతున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.4,200లుగా ఉన్న వారి వేతనాన్ని రూ.10,500లకు పెంచింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వేతనాలు బాగా పెరుగుతాయని వారంతా ఆశించారు. కానీ రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకుంది. కనీస వేతనం అమలు చేస్తామని వైసీపీ ప్రకటించినా అమలు చేయలేదని వారు తిరగబడ్డారు. కానీ ఫలితం లేకుండా పోయింది.

- ఎస్మా ప్రయోగించినా..

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో 2023, డిసెంబరు 12 నుంచి 2024 జనవరి 23వ తేదీ వరకు వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీలు పోరాటం చేశారు. వారి విన్నపాలు అప్పటి వైసీపీ పెద్దలకు చెవికెక్కలేదు. పైగా ఎస్మా ప్రయోగించి, విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. అయినా వారు ఏమాత్రం జంకలేదు. 42 రోజులపాటు సుదీర్ఘంగా పోరాడినా డిమాండ్లను సాధించుకోలేక పోయారు. చట్ట ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా దాని అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని వారు ఆరోపించారు. ఈ క్రమంలో మళ్లీ తమ డిమాండ్ల సాధన కోసం పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో వారు తిరిగి ఆందోళనబాట పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమ డిమాండ్లన్నీ పరిష్కారమవుతాయనే ఆశతో వారున్నారు

డిమాండ్లు ఇవే...

- అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలి. హెల్పర్లకు రూ.26వేలు ఇవ్వాలి.
- ఐసీడీఎస్‌కు అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలి.
- గుజరాత్ హైకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లను మూడో తరగతి, హెల్పర్లను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి.
- పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి.
- వేతనాలు, అలవెన్సులు, అద్దెలు, మొబైల్ ఫోన్లు, రీచార్జుల బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి.
- ఏ రూపంలోనూ ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరించరాదు.
- సీఎస్ఆర్ పేరుతో ఐసీడీఎస్‌లో కార్పొరేట్లు ఉండరాదు. నగదు బదిలీ ఉండరాదు.

కనీస వేతనం ఇవ్వాలి



ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు చిన్నారులసేవలో ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటుతున్నాయి. చాలీచాలనీ వేతనాలతో జీవనం గడపలేక పోతున్నాం. కనీసం వేతనం రూ.32 వేలు ఇవ్వాలి. గ్రాట్యూటీ చెల్లించాలి.

- ఏలూరు సుజాతమ్మ, జిల్లా అధ్యక్షురాలు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ఏళ్ల తరబడి అంగన్‌వాడీలుగా పని చేస్తున్నాం. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

- రెహనాబేగం, కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

జైలు సూపరింటెండెంట్‌గా

వెంకటేశ్వరరావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెం డెంట్ (ఎఫ్ఏసీ)గా వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న రాజారావుపై పలు అవినీతి ఆరోపణలకు సంబంధించిన వాయిస్ రికార్డులు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం డీఐజీ డాక్టర్ వరప్రసాద్ మూలాపేటలో ఉన్న ఏపీ స్టార్స్‌లో రహస్యంగా విచారించారు. అవినీతికి సంబంధించిన ఆడియోలో ఉన్న వ్యక్తులను పిలిచి విచారించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకున్నారు. ఈ క్రమంలో నెల్లూరు సెంట్రల్ జైలు సూప రింటెండెంట్‌గా ఉన్న రాజారావును ఏపీ స్టార్స్‌కు బదిలీ చేస్తూ గురువారం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జిల్లా సబ్ జైళ్ల అధి కారిగా ఉన్న వెంకటేశ్వరరావును ఎఫ్ఏసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

అలరించిన సూర్యాస్తమయం



పెన్నానదిలో గురువారం సాయంత్రం సూర్యాస్తమయం ప్రకృతి ఆరాధికులను అలరించింది. పడుగుపాడు- నెల్లూరు మార్గంలో సూర్యాస్తమయం దృశ్యాలను పలువురు తమ సెల్‌ఫోను, కెమెరాల్లో బంధించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



మడుగును తలపిస్తున్న రోడ్డు



పైపులో నుంచి వస్తున్న నీరు

పిల్లలకు మాత్రం భలే సరదా!



నీరక్షం!

• రోడ్డుపాలవుతున్న తాగునీరు

నగరంలోని భగత్‌సింగ్ కాలనీ టిడ్కో అపార్టమెంట్ల ఆవరణలో దుస్థితి ఇది. అపార్ట్‌మెంట్లపై ట్యాంక్‌ల నుంచి నీటిని వది లేయడంతో ఇదిగో ఇలా రోడ్డంతా మడుగును తలపించింది. ట్యాంకు నిండిన వెంటనే మోటరు ఆఫ్ చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. స్థానికులే కాదు.. కార్పొరేషన్ సిబ్బంది కూడా పట్టించుకోకపోవడంతో నిత్యం నీరంతా ఇలా వృథా అవుతోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సింహపురి సీమ మరో చరిత్రకు నిదర్శనం కాబోతున్నది. ఎప్పుడో 45 ఏళ్ల క్రితం సీపీఎం రాష్ట్ర మహాసభలు ఈ జిల్లాలో జరిగాయి. తాజాగా ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఆ పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు ఇక్కడ జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు ఉద్యమాల గురించి రేఖామాత్రంగా చెప్పుకోవడం ముదావహం. మహాసభల ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనసమీకరణలో భాగంగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సర్వశక్తులు ఒడ్డి పార్టీ శ్రేణులు సభల విజయవంతానికి కృషి చేస్తున్నారు.



నెల్లూరు : కనకమహల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహాసభల స్వాగత ద్వారం

• రేపటినుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు
• ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లు సింహపురి
• నాటి పుచ్చలపల్లి నుంచి నిన్నటి జక్కా వెంకయ్య వరకు..
• ఆస్తులు సైతం వదులుకున్న త్యాగధనులు

కమ్యూనిస్టుల పురిటిగడ్డపై

మహా సంబరం!

నెల్లూరు (వైద్యం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమాల్లో జిల్లాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉద్యమ నాయకుడిగా దక్షిణ భారతంలో అనేక ప్రజా పోరాటాల ద్వారా పుచ్చలపల్లి సుందరయ్య తనకంటూ ఓ గుర్తింపు పొందారు. తొలుత కోవూరు నియోజకవర్గ పరిధిలోని అలగాడుపాడులో ఆయన 1934లోనే రైతు ఉద్యమాన్ని ప్రారభించారు. ఆ తర్వాత కమ్యూనిస్టు నేతగా ఎన్నో పోరాటాలు చేశా రు. ఉభయ కమ్యూనిస్టుల రాష్ట్ర కార్యదర్శిగా కూడా సుందరయ్య పనిచేశారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి 1956, 1967 సంవత్సరాల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేసి ఉత్తమ ఎంపీగా వినతి కెక్కారు. ఎంపీగా అనేక సంస్కరణలు తీసుకు వచ్చారు. తన యావదాస్తిని పేదలకు పంచిపెట్టారు.

• నాడు ఎంతో ప్రాభవం

అప్పట్లో జిల్లాలో కమ్యూనిస్టుల ప్రాభవం ఎంతో ఉండేది. 1952లో కోవూరు నుంచి బస్వారెడ్డి శంకరయ్య, నెల్లూరు జనరల్ నుంచి ఖండవల్లి కృష్ణారావు, ఆత్మకూరు నుంచి జీసీ కొండయ్య, నెల్లూరు రిజర్వుడు నియోజకవర్గం నుంచి స్వర్ణావేమయ్య కమ్యూనిస్టు ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రజాదరణ పొందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు డాక్టర్ రామచంద్రారెడ్డి 1950లో నగరంలోని శంకర అగ్రహారంలో చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేసి, ఆ తర్వాత దాన్ని విస్తరించారు. అప్పట్లో జిల్లా నుంచే కాకుండా చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లాల నుంచి కూడా రోగులు ఇక్కడకు వచ్చి వైద్య చికిత్సలు పొందేవారు. కమ్యూనిస్టుల ఆసుపత్రిగా దీనికి పేరు ఉన్నా పార్టీలకు అతీతంగా పలువురు ఇక్కడ వైద్య చికిత్సలు అందుకున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంది. 1956లో పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య ఆశయాలకు ఆకర్షితులైన డాక్టర్ జెట్టి శేషారెడ్డి తన వైద్య వృత్తిని ఆసుపత్రిలోనే కొనసాగిస్తూ కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మరణానంతరం శేషారెడ్డి ఆసుపత్రి బాధ్యతలు

చరిత్రలో రామచంద్రారెడ్డి ఆసుపత్రి

చేపట్టారు. హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. అలాగే నెల్లూరులో రెడ్‌క్రాస్‌లో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు కూడా అవిరళ కృషి చేశారు. 2008 జూన్‌లో ఆయన మృతిచెందారు. ఆయన జ్ఞాపకార్థం సీపీఎం నేతలు డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రాన్ని నగరంలో ఏర్పాటు చేశారు. పేదలకు ఎన్నో వైద్యసేవలు అందిస్తున్న రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల(పీపీసీ) జిల్లా చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకుంది.



జక్కా వెంకయ్య కూడా ఎన్నో ప్రజా ఉద్యమాలు చేపట్టారు. 1985, 1995లలో అల్లూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి జిల్లాలో పలు సంస్కరణలు తీసుకు వచ్చారు. రైతు, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి విజయం సాధించారు. ఈయన కూడా తన ఆస్తులను ప్రజలకు పంచిపెట్టారు. మంచి కమ్యూనిస్టు యోధుడిగా జిల్లాలో గుర్తింపు పొందారు.



నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయం ఇదే!

సారా, అక్షరాస్యత ఉద్యమంలోనూ..

జిల్లాలో సారా, అక్షరాస్యత ఉద్యమాల్లో కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారు. 1992 డిసెంబరు ఒకటి నుంచి 17 వరకు ఆయా ఉద్యమాలపై పోరాటం చేసేందుకు నాలుగు బృందాలు జిల్లాలో పర్యటించాయి. కొండాపురం మండలం దూబగుంటలో దూబగుంట రోశమ్మ తన కుమారులు సారాకు బానిసలు అవడంతో సారాకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారు. దీంతో సారా ఉద్యమం ఊపందుకుంది. అప్పట్లో వీఆర్‌సీ క్రీడా మైదానంలో జరిగిన సమావేశంలో 50వేలమంది తరలివచ్చారు. ఇందులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసీ స్టేడియంలో జరిగిన సారా వేలంపాటలను అడ్డుకునేందుకు 1993 సెప్టెంబరులో పెద్దసంఖ్యలో ఉద్యమకారులు తరలివచ్చి వేలంపాటలను అడ్డుకున్నారు. అప్పట్లో తిరుపతి షూటింగ్‌లో ఉన్న ఎన్‌టీ రామారావు నెల్లూరు ఏసీ స్టేడియం చేరుకుని ఉద్యమకారులను కలిశారు. తనను గెలిపిస్తే సారా నిషేధిస్తానన్నారు. ఉద్యమకారుల దెబ్బకు దిగి వచ్చిన అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సారా వేలంపాటను రద్దు చేశారు. ఇందులో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారు. ఇలాంటి కమ్యూనిస్టు ఉద్యమాలకు నెల్లూరు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. నాటి ఉద్యమకారులను ఆదర్శంగా తీసుకుని నేడు నాయకులు, కార్యకర్తలు నడవాలని సీపీఎం అగ్రనేతలు చెబుతున్నారు.


ప్రయోగ పరీక్షల్లో

ప్రణాళికతోనే విజయం

• ఇంటర్‌లో ఉత్తమ మార్కులకు అవకాశం
• విషయ నిపుణుల సూచనలు ఎంతో ముఖ్యం

నెల్లూరు (విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలే కాదు ప్రయోగ పరీక్షలూ ఎంతో ముఖ్యమైనవి. ఇప్పటికే జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కుల కోసం విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. అంతకంటే ముందుగా జరిగే ప్రయోగ పరీక్షలకూ ఇప్పటినుంచే సన్నద్ధం కావాల్సి ఉంది. విద్యార్థుల్లో సబ్జెక్టులపై ఆసక్తి, విశ్లేషణ సామర్థ్యాలు, నైపుణ్యం వంటి వాటిపై ప్రయోగ పరీక్షలు అవగాహన పెంచుతాయి. ప్రయోగాత్మక అంశాలు, సూత్రాలు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ఆవిష్కరణల రూపకల్పనకు దోహదం చేస్తాయి. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు అవసరమైన నైపుణ్యాలను కల్పిస్తాయి. వచ్చే నెల 10 నుంచి 20వతేదీ వరకు జిల్లాలో 121 కేంద్రాల్లో సైన్స్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు 23,507 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు సమయం సమీపిస్తుండటంతో విద్యార్థులు ఏ ఏ అంశాలపై దృష్టి సారించాలన్న విషయాలపై జిల్లాలోని సబ్జెక్ట్ నిపుణులు తెలియచేశారు.

విభిన్నం.. భౌతికశాస్త్రం



భౌతికశాస్త్ర ప్రయోగ పరీక్ష మిగిలిన సబ్జెక్టులతో పోలిస్తే కాస్త విభిన్నం. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రయోగాలను సాధన చేయడం ద్వారా 30 మార్కులను సాధించవచ్చు. ప్రతి విద్యార్థి వార్షిక ప్రయోగ పరీక్షల్లో లాటరీ పద్ధతి లో ఒక ప్రశ్నను ఎంచుకుని జవాబు రాయాల్సి ఉంటుంది. సూత్రం, ప్రయో గ విధానానికి 5, పట్టిక రూపం, గ్రాఫ్-పరిశీలనలకు 8, జాగ్రత్తలకు 2, గణన, ఫలితం 6, మౌఖిక పరీక్ష 5, రికార్డుకు 5 మార్కులు ఉంటాయి. నేర్చుకున్న ప్రయోగాన్ని సరైన విధా నంలో ప్రదర్శన చేయడంపై ధ్యాస ఉంచాలి. అప్పుడే మంచి మార్కులు సాధించవచ్చు.

- ఎస్‌కె.గౌస్ బాషా, భౌతికశాస్త్ర అధ్యాపకుడు, టీఎన్‌సీ కోవూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



సులభంగా జంతుశాస్త్రం



జంతుశాస్త్ర ప్రయోగ పరీక్షలు మిగిలిన సబ్జెక్టులతో పోలిస్తే సులభంగా ఉంటాయి. 68 ప్రయోగ ప్రశ్నలను 3 విభాగాలుగా విభజించారు. రికార్డును 4వ విభాగంగా పెట్టారు. మొదటి విభాగంలోని నమూనాలు, చార్టులు, ప్రొజెక్టన్‌కు సంబంధించి 11 ప్రశ్నల్లో ఒక దానికి సమాధానం రాసేలా సన్నద్దమ వ్వాలి. విద్యార్థులు నమూనా, చార్టు, ప్రొజెక్షన్‌ను గుర్తించి చక్కటి పటం గీసి కనిష్ఠంగా నాలుగు విభాగాలుగా గుర్తిస్తే 6 మార్కులు పొందవచ్చు. రెండో విభాగంలో శరీర ధర్మశాస్త్ర ప్రయోగాలపై ఇచ్చే 5 ప్రశ్నలలో ఒకదానికి సమాధానం రాయాలి. దీనిలో సూత్రం, ప్రయోగ విధాన ఫలితం రాస్తే 5 మార్కులు వస్తాయి. మూడో విభాగంలో 7 సహ విభాగాలుగా విభజించారు. అందులో స్లైడ్స్, స్పెసిమన్‌లు, క్షీరద కీళ్లు ఉంటాయి వీటికి 14 మార్కులు కేటాయించారు. దీనిలో గుర్తింపు లక్షణాలపై విద్యార్థులు ఖచ్చితంగా దృష్టి సారించాలి. రికార్డుకు సంబంధించిన విద్యార్థులు చక్కటి పటాలు వేస్తూ చేతిరాతను అందంగా రాసేలా సన్నద్ధమవ్వాలి. వీటికి 5 మార్కులు ఉంటాయి. దీనిపై పూర్తిగా శ్రద్ధ వహిస్తే పూర్తి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

- డాక్టర్ ఎం.రమణారెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు, కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

రసాయనశాస్త్రంలో అవగాహన ముఖ్యం



రసాయనశాస్త్రం ప్రయోగ పరీక్షల్లో 30 మార్కులు సాధించాలంటే విద్యార్థులు ప్రయోగాలపై అవగాహన కలిగి ఉండాలి. సూత్రం, ప్రతి ప్రయోగ పరీక్ష వివరాలు, సమాధానాలు చక్కగా రాసే విధానాలపై ధ్యాస ఉంచాలి. లవణ జల విశ్లేషణలో 12 లవణాల్లో ఒక లవణాన్ని లాటరీ ద్వారా విద్యార్థి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దీనిలో ఆనయాన్, కాటయాన్ గుర్తించి వాటి ఆధారంగా లవణం పేరు రాయాలి. ఇందుకోసం వాటిని ఎక్కువగా సాధన చేస్తూ ఉండాలి. ఘనపరిమాణాత్మక విశ్లేషణలో తెలిసిన ఒక ద్రావణం గాడతను లెక్కించాలి. వీటిలో అమ్లక్షార విశ్లేషణలకు సంబంధించి ప్రశ్నలు ఉంటాయి. గణన, విశ్లేషణ సామర్థ్యాలను నేర్చుకుంటే 8 మార్కులు సాధించవచ్చు. అలాగే నాలుగు ఉప విభాగాలపై ఏదైనా ఒకదాని నుంచి మాత్రమే సమాధానం రాస్తే 6 మార్కులు పొందవచ్చు. అలాగే సాల్ట్ అనాలసిస్ 10 మార్కులు, రికార్డ్‌కు 2, ప్రాజెక్ట్ వర్క్‌కు 2, వివాకు 2 మార్కులు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు వాటిపై పూర్తి అవగాహన పెంచుకుని పరీక్షలకు సన్నద్దమవ్వాలి.

- పాలకొలను లక్ష్మీరెడ్డి, రసాయన శాస్త్రం అధ్యాపకుడు, ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆసక్తిగా వృక్షశాస్త్రం



విద్యార్థులు తమ నిత్య జీవితంలో చూసే మొక్కల లక్షణాలు, నిర్మాణం, పుష్ప విన్యాసం, శాఖీయోత్పత్తి తదితర అంశాలను ఆసక్తిగా అధ్యయనం చేయాలి. వృక్ష వర్గీకరణ శాస్త్రంలో గుర్తింపు, శాఖీయ లక్షణాలు, పుష్ప విన్యాసంతో కూడిన కొమ్మ, పుష్పం నిలువు కోత చిత్రాలకు సంబంధించిన పటాలు, సమీకరణంపై విద్యార్థులు సృజన పెంచుకోవాలి. అంతర్నిర్మాణ శాస్త్ర విభాగంలో సెక్షన్ కటింగ్, విభాగ విచ్ఛేదనం చేసి గుర్తింపు, స్లైడ్ ప్రిపరేషన్ భాగాలతో కూడినపటం వేసేలా నైపుణ్యతను ప్రదర్శించేలా సన్నద్ధమవ్వాలి. లైవ్ ప్రయోగాల విభాగంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేసే ప్రశ్నకు సమాధానం రాయాల్సి ఉంటుంది. దీనిలో ప్రయోగం చేయడం, ఉద్దేశం, సూత్రం, పరిశీలన, అనుమతి గురించి రాసేలా విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. నాలుగో విభాగంలోని 5 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రతి బిట్‌లో ఒక ప్రశ్నకు సమాధానం రాయాలి. గుర్తింపు కారణాలు రాసేలా సన్నద్ధమవ్వాలి.

- ఎస్.మృదుల, వృక్షశాస్త్రం అధ్యాపకురాలు, బుచ్చి ప్రభుత్వ జూనియర్ కళాశాల

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు నిధులు మంజూరు చేయండి : అజీజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం రూ.50 కోట్లు, మసీదుల మర మ్మతులకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్ర బాబును వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వక్ఫ్‌బోర్డ్ నుంచి ఏపీ వక్ఫ్‌బోర్డ్‌కు రావాల్సిన రూ.50 కోట్లు పెండింగ్ బకా యిలను ఇప్పించాలని కోరారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు చెందిన అన్ని రికార్డులు, పత్రాలు తెలంగాణ నుంచి బదిలీ చేయలేదని, ఆస్తులను అప్పగించలేదన్నారు. ఆదాయం లేని 1500 మసీదుల పెండింగ్ దరఖాస్తులను, మసీ దులు, కాంపౌండ్ గోడలు, గ్రేవ్ యార్డ్‌లు, ఈద్గాలు, అషూర్ ఖా నాలు, దర్గాలు నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిధులు కేటా యించాలని ఆయన సీఎంను కోరారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

రీసర్వే భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

• ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాధపురం) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూసమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో తహసీల్దారు, సర్వేయర్లతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే గ్రామసభల్లో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారం చూపాలన్నారు. ఎఫ్ లైన్ సర్వే, పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు పెండింగ్ ఉండకూదన్నారు. ప్రతిరోజూ రెవెన్యూ డివిజనల్ అధికారులు మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై సమీక్ష చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఫిబ్రవరి 15లోగా నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ను భూసేకరణ, నష్టపరిహారం వివరాలు కలెక్టరేట్‌కు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా భూసర్వే రికార్డుల ఏడీ వై.నాగోశేఖర్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారులు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికపై కసరత్తు



నెల్లూరు, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే క్రమంలో డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఖాళీ ఏర్పడిన స్థానాన్ని భర్తీ చేయడానికి వచ్చే నెల 3వ తేదీన ఎన్నిక జరగనుంది. 54 డివిజన్ల సంఖ్యాబలం కలిగిన కార్పొరేషన్‌లో గతంలో జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో మొత్తం స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అయితే రాష్ట్రంలో అధికారం మార్పిడితో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరిపోయారు. ప్రస్తుతం టీడీపీకి 41 మంది కార్పొరేటర్లు ఉన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలో 20, రూరల్ నియోజకవర్గ పరిధిలో 21 మంది కార్పొరేటర్లు టీడీపీ పక్షం ఉన్నారు. 41 మంది కార్పొరేటర్లకాక అదనంగా ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఓటుతో కలిపి 43 ఓట్లతో టీడీపీ బలంగా ఉంది. ఇక వైసీపీ విషయానికి వస్తే కేవలం 12 మంది మాత్రమే మిగిలారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఏడుగురు, రూరల్ నియోజకవర్గ పరిధిలో ఐదుగురు ఉన్నారు. ఖలీల్ రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, వైసీపీకి రాజీనామా చేసిన క్రమంలో మేయర్ స్రవంతి తటస్తంగా ఉన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీకి అనుకూలంగా ఏకపక్షం అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నామ మాత్రపు బలం ఉన్న కారణంగా వైసీపీ పోటీ చేయబోదనే అందరూ భావించారు. అయితే గురువారం రాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైసీపీ కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం కొసమెరుపు. కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, వైసీపీకి చెందిన పది మంది కార్పొరేటర్లు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం అయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో పోటీ చేయాలా, తప్పుకోవాలా అనే అంశంపై చర్చించుకున్నారు. ఓడినా, గెలిచినా పోటీ చేయడమే మంచిదనే నిర్ణయానికి వచ్చారు.

• మైనారిటీలకే కేటాయించాలన్న టీడీపీ

డిప్యూటీ మేయర్ అభ్యర్థి విషయంలో తెలుగుదేశం అధిష్టానం జిల్లా పార్టీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గతంలో డిప్యూటీ మేయర్‌గా మైనారిటీ అభ్యర్థి ఉన్న కారణంగా అదే వర్గానికి చెందిన వారికే అవకాశం ఇవ్వాలని టీడీపీ అధిష్టానం ఆదేశించింది. నగరంలో ముస్లిం మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉండటం, గతంలో తమ వర్గానికి చెందిన వ్యక్తి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాన్ని తమ వర్గానికే కేటాయించాలని మైనారిటీ నాయకులు టీడీపీ అధినాయకత్వాన్ని కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ తహసిన్ పేరు ప్రచారంలోకి వచ్చింది. మరోవైపు వైసీపీ కూడా మైనారిటీ అభ్యర్థినే రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు.

సగానికి తగ్గిన దిగుబడులు

- ఎకరానికి 20-25 బస్తాల లోపే..
- తలలు పట్టుకుంటున్న అన్నదాతలు

జలదంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ ఏడాది సాగు చేసిన వరిపంట దిగుబడి సగానికి తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు కెఎన్‌ఎం 1630రకంను సాగు చేశారు. ప్రారంభదశలో పైరుగానే కన్పించినా పిలకలు వచ్చే దశలోనే వెన్ను వచ్చిందని వాపోతున్నారు.

● బీకె అగ్రహారం కాకమ్మ చెరువు సాగునీటిసంఘం అధ్యక్షుడు లింగంగుంట వెంకటేశ్వర్లు 3ఎకరాల మాగాణిలో వరిపంట సాగుచేశాడు. మూడురోజుల కిందట వరికోత కోశాడు. కల్లంలోనే దళారీకి ధాన్యంను అమ్మారు. తేమ శాతం కింద బస్తాకు 3కిలోలు తీసేశా డు. ఎకరానికి 20బస్తాల దిగుబడి వచ్చింది.

● ఇదే గ్రామానికి చెందిన గన్నవరం వెంకటేశ్వర్లు 2ఎకరాలు పొలంలను కౌలుకు తీసుకుని వరికోత సాగుచేశాడు. ఎకరానికి 22బస్తాలు వచ్చాయి. అలాగే వంటేరు దశరథ రామిరెడ్డి 2ఎకరాలు వరికోత కోయగా 24బస్తాల దిగుబడి వచ్చింది. రైతులు ముగ్గురూ కెఎన్‌ఎం 1638 రకం వరిసాగు చేసినట్లు తెలిపారు. దిగుబడులు చూసి ఇవేం దిగుబడులు బాబోయ్ అని తలలు పట్టుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందవని చెబుతున్నారు. సొంత పొలం రైతుల పరిస్థితే ఇలా ఉంటే కౌలుకు తీసుకున్న రైతులకు ఎకరానికి రూ.20వేలు నష్టం వచ్చిందని తెలిపారు. మార్కెట్లో మంచి ధర పలికే మసూరి రకం కెఎన్‌ఎం1638, ఆర్‌ఎన్‌ఆర్ రకాలు విత్తనాలు సాగు చేసినా పరిస్థితి ఇలాగే ఉందని చర్చించుకుంటున్నారు. ముసురు వర్షాలతో వాతావరణంలో వచ్చిన మార్పులు మరో కారణంగా చెబుతున్నారు. చెరువులు, కాలువల్లో సాగునీరు పుష్కలంగా సాగునీరు ఉన్నా ఈ ఏడాది అధిక లాభాలు వస్తాయని ఆశించిన రైతులకు మాత్రం నిరాశే మిగిలింది.


బీకే అగ్రహారానికి వెళ్లే రోడ్డులో ధాన్యం రాశి

గాంధీ మార్గం.. ఆచరణీయం

- ఎమ్మెల్యే కృష్ణారెడ్డి
- జాతిపితకు ఘన నివాళి


ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న హుస్సేనమ్మ తదితరులు

కావలి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ మార్గం ఆచరణీయమని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మాగుంట పార్వ తమ్మ రోడ్డు వద్ద నున్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్, విగ్రహ కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్, గుత్తికొండ కిషోర్, పోట్లూరు శ్రీనివాసులు, జ్యోతి బాబురావు, గాదంశెట్టి వేణు పాల్గొన్నారు.

● వైసీపీ ఆధ్వర్యంలో ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసం వద్ద చేపట్టిన వేడుకలో కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జడ్పీటీసీ రాఘవులు, కనమర్లపూడి నారాయణ, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో నేతలు తాళ్లూరు మాల్యాద్రి, పెంచులయ్య, కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆదేశాలతో నేతలు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

● జలదంకి: గట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కా ర్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మజ పాల్గొన్నారు. అనంతరం కుష్టువ్యాధి నేపథ్యం, నివారణ గురించి వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● లింగసముద్రం:స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్య వైశ్య సంఘం మండలాధ్యక్షులు వెంకట సుబ్బారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జల్లు హజరత్తయ్య, దేవ కి సుబ్బారావు, దోరడ్ల వెంకటేశ్వర్లు, దేవకి బసవారావు, దేవకి వెంకట సత్యనారాయణ, దోరడ్ల శ్రీహరి పాల్గొన్నారు.

● ఉలవపాడు: ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బలసా సురేష్‌కుమార్, పొన్నూరు రామాంజనేయులు, దివ్యనంద గుప్తా పాల్గొన్నారు.

● కలిగిరి: లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి నాగసముద్రం పంచాయతీ వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొ నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త దొరసానమ్మ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పట్టణంలో యుపిహెచ్‌సిలో జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ మెడికల్ ఆఫీసర్ షేక్ అస్మా, వైద్య సిబ్బందితో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణపై ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్ సుధాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, మురారిశెట్టి సుధీర్, గుర్రం అల్లూరయ్య, చక్కా కేశవరావు, చీదెళ్ల వేణు, కాకుమాని ప్రవీణ్, పబ్బిశెట్టి రాజా ఉన్నారు. అలాగే పెద్దబజారు గాంధీ విగ్రహం వద్ద విగ్రహ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వరదరాజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● సంగం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి ఆర్యవైశ్యులు నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ వరప్రసాద్, ఆర్యవైశ్యులు గిరి, ప్రభాకర్, శ్రీరామ్, రాజ పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ పద్మజ, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ సమద్, టీడీపీ యూత్ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ, సిబ్బంది ఇమ్రాన్, లక్ష్మీ, మస్తాన్ పాల్గొన్నారు.

● వింజమూరు: ఎండీవో కార్యాలయంలో గాంధీ విగ్రహానికి తెలుగుదేశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, పాములపాటి మాల్యాద్రి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంగయ్య, మండల ఐటీడీపీ అధ్యక్షుడు ఆరికొండ శ్రీనివాసుల పాల్గొన్నారు.


కావలి టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి


కందుకూరు: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు


సంగం: నివాళులు అర్పిస్తున్న అధికారులు


ఉదయగిరి: నివాళులర్పిస్తున్న సిబ్బంది


లింగసముద్రం: నివాళులర్పిస్తున్న వెంకటసుబ్బారావు


వింజమూరు: పాల్గొన్న ఎమ్పీడీవో కార్యాలయ సిబ్బంది


కలిగిరి: నివాళులర్పిస్తున్న మాలకొండారెడ్డి

ప్రతి ఇంటికీ మంచినీరిస్తాం

● శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి



కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి ఇంటికీ కొళాయిలతో తాగునీరం దించటమే లక్ష్యంగా ప్రణాళిక లు తయారు చేస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని కొన్నిచోట్ల మాత్రమే ట్యాంకర్లతో నీరు చేస్తున్నట్లు చెప్పా రు. అన్ని ప్రాంతాలకు మంచినీటి పైపులైన్లు విస్తరింప జేస్తా మన్నారు.

ఈ ముఖాముఖి

? నీటి సరఫరా ఎలా చేస్తున్నారు.

! ట్యాంకర్లు లేకుండా ప్రతి ఇంటికీ కొళాయితో తాగునీరు అందించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

? పట్టణంలో ఎన్ని గృహాలు ఉన్నాయి.

! ప్రస్తుతం 25వేల గృహాలున్నాయి. అన్నికాలనీల్లో కలిసి 6,900 కొళాయి కనెక్షన్‌లు ఉన్నాయి

? అక్రమ కనెక్షన్‌లు ఉన్నాయా

! వెయ్యి అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. వాటిపై కనెక్షన్‌లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మంచినీటి పైపులైన్లు లేని ప్రాంతాలలో అమృత్ పథకం కింద పైపులైన్లు వేస్తాం. అలాగే ప్రతి ఇంటికి కొళాయి ద్వారా తాగు నీరు అందిస్తాం.

సంగసానిపల్లిలో ప్రముఖులు

సీతారామపురం(ఆంధ్రజ్యోతి):సంగ సానిపల్లిలో గురువారం మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంగళశెట్టి వెంకటయ్య పెద్దకర్మ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, బొల్లినేని రామరావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పాల్గొన్నారు. వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల చెన్నకేశవులు, జామవా, పిడుగు రమేష్, భోగినేని కాశీరత్తయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

హద్దు రాళ్ల తొలగింపు

కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు పట్టణంలో అక్రమ లేఅవుట్లను గుర్తించి కొరడా ఝుళిపించారు. గురువారం వెంగాయగారి పాలెంలో సర్వే నంబరు 443, 444, 445లో ఆరు ఎకరాల్లోని అక్రమ లేఅవుట్లను పరిశీలించి హద్దు రాళ్లు, రోడ్లు, కాలువలను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, పట్టణ ప్రణాళికాధికారి వివేకా నంద సిబ్బంది ఉన్నారు.

ఆర్వోబీ పనుల పరిశీలన

కావలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెన నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరిశీలించారు. మరమ్మతులు చేపడుతున్న హైవే సిబ్బందితో పనుల వివరాలు తెలుసుకున్నారు. నాణ్యతతాప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు .

జంగిల్ తొలగింపు

లింగసముద్రం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 16గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాల వద్ద పిచ్చి చెట్లతో నిండి ఉన్న జంగిల్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం చినపవని చెత్త సంపద కేంద్రం వద్ద ఉన్న జంగిల్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. ఎరువుల తయారీకి వినియోగించే తొట్లలోని జంగిల్‌ను కూడా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సోంపల్లి మనోహర్, కార్యదర్శి రషీద్ ఉన్నారు.

హక్కులపై అవగాహన

ఉలవపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు లావణ్య గురువారం స్థానిక వరిగచేను సంఘం గిరిజన ప్రాథమిక పాఠశాలలో జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్నారు. కాలనీవాసులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థుల ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫి కెట్ల కోసం ఇబ్బంది పడుతున్నట్లు హై స్కూల్ హెచ్‌ఎం శివనాగేశ్వరరావు, ఎంఈవో-2 రమణయ్యలు తహసీల్దారు లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. స్థాక సమస్యలపై వివిధ శాఖల అధికారులు చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, కార్యదర్శి వీరయ్య, ఉన్నారు. పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

ఆత్మకూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ గంగాప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచిం చారు. క్యాంటీన్‌లో భోజనం చేసున్న వారిని కూరలు రుచిగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆయన భోజనం చేశారు.

నిర్మాణ పనుల ప్రారంభం

ఉదయగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నూతన మురుగు కాలువ నిర్మాణ పనులను గురువారం ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, నాయకులు ఎంఏ రియాజ్, ఉప్పుటూరి శ్రీనివాసులు, హరి, యస్థాన్, ఖాదర్‌బాషా, జబీవుల్లా పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

సంగం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వంగల్లు డంపింగ్ యార్డును ఈవోపీఆర్డీ వరప్రసాద్ గురువారం పరిశీలించారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో సేకరించే పొడి, తడి చెత్తను వేరుచేసి సంపద సృష్టించేందుకు డంపింగ్ యార్డులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వెంట కార్యదర్శి, సర్పంచ్ పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 30 (ఆంధ్రజ్యోతి):నర్రవాడ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీజనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 2, 3వ తేదీల్లో చిన్న జీయర్ స్వామి ప్రవచనాలు ఉంటాయన్నారు.

సబ్సిడీపై అవగాహన

ఉదయగిరి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి జయశ్రీ అన్నారు. గురు వారం అప్పసముద్రంలో పర్యటించిన ఆమె రైతులతో చర్చించి పథకాలపై అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు, డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకున్న రైతులు అదేరోజు నగదు చెల్లించి పరికరాలు తీసుకోవాలని సూచించారు. అలాగే అవసరమైన రైతులు సైతం రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు శేఖర్, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్ పేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి గురువారం ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఇతర కార్పొ రేషన్ల ద్వారా 53మందికి రూ.115.78లక్షలు సబ్సిడీ అందిస్తామని తెలిపారు. కుల ము, పుట్టిన తేదీ, రేషన్, ఆ ధార్ కార్డులు, బ్యాంక్ పాసుబుక్, ఫోటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు.. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండల కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పంచాయతీరాజ్ వ్యవస్థలను పటిష్టం చేసినట్లు తెలిపారు. ఆరునెలల్లోనే నియోజకవర్గంలోని సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.15కోట్లు ఇచ్చిందన్నారు. తారురోడ్ల నిర్మాణానికి రూ.9కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి కందుకూరు నియోజకవర్గానికి తాగు, సాగునీటి సరఫరాకు కృషి చేస్తా మన్నారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసేందుకు మండలానికి ఒక రెవెన్యూ గ్రామంను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకరానుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీఓ నరేంద్రదేవ్, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్ ఎంపీటీసీలు చింతలపూడి రవీంద్ర, చౌడబోయిన యానాది, వడ్లమూడి జయమ్మ, సర్పంచ్‌లు సతీష్, అమరేశ్వరి నవ్వులూరి రాజారమేష్ పాల్గొన్నారు.

● బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కొండసముద్రంలో ఇటీవల మృతి చెందిన నెల్లూరు జిల్లా టెలికాం బోర్డు సభ్యులు గుర్రం మాల్యాద్రి అమ్మమ్మ ఇంటూరి సుబ్బమ్మ దిశదినకర్మలో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం ఉన్నారు.


వీవీపాలెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

● మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు శంకుస్థాపన

కందుకూరు: పట్టణంలో మురుగునీటి కాలుష్యాన్ని తగ్గించి ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం కోసం రూ.19.40 కోట్లతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, డీఈఈ గణపతి, పార్టీ పట్టణాధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, వడ్డెవల్లి వెంకటరావు, దివి మాధవరావు, నల్లూరి వీరరాఘవు పాల్గొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవో ఆకస్మిక తనిఖీ

కావలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గౌరవరం స చివాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిరు వ్యాపార సముదాయాల వివరాలు, ఈకేవైసీఈ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యుల ఈకెవైసీ, స్కూల్, ల్యాండ్ రికార్డులు, ఆరోగ్యశ్రీకార్డులు,జియోట్యాగింగ్ సర్వేల వివరాలు, సచివాలయ రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయానికి వెళ్లి 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు, సచివాలయాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రగతి, అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్, కార్యదర్శి అఖిల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న మోహన్‌రావు

విద్యకు మించిన విలువ దేనికీ లేదు: ఎమ్మెల్యే దగుమాటి

కావలి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యను మించిన విలువ దేనికీ లేదని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మనోహర్‌రెడ్డి, నారాయణ కల్యాణ మండపంలో పాతూరు శ్రీచైతన్య జూనియర్ కళాశాల 23వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ వెంకయ్య, ప్రిన్సిపాల్ లుకోధర్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ అ ప్పారావు, నవీన్, వినోదిని అలరించారు. ర్యాంకులు చ్చిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బెజవాడ రవికుమార్, డైరెక్టర్‌లు ప్రసాద్, కొండయ్య, మధుసూదన్‌రావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● కందుకూరు: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అని చెప్పుకోటానికి గర్వపడతానన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం విద్యా ర్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు: ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎంఈవో-1 శివనాగేశ్వరరావు, పెద్దపట్టపుపాలెం, చాకిచర్ల హెచ్‌ఎంలు ఎస్‌కే సలీం భాషా, జనార్దనరావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ గోపిచంద్ ప్రకాష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

● బిట్రగుంట: విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో 50 ఏళ్ల వసంతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ, సరస్వతి నమఃసుబ్బ్యం వ్యవస్థాపకులు ప్రసాద్‌రావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉన్నారు.


కావలి: సందడి చేస్తున్న జబర్దస్త్ ఫేమ్ ఆర్టిస్ట్‌లు అప్పారావు, నవీన్, వినోదిని

హెల్మెటే ద్విచక్ర వాహనదారులకు రక్ష

కావలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వాడకం ప్రమాదకర సమయంలో ద్విచక్ర వాహనదారులకు రక్ష అని ఆర్టీవో వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో ఆర్టీవో సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు పర్యవేక్షణలో గురువారం హెల్మెట్ వాడకంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆర్టీవో మాట్లాడారు. హెల్మెట్ లేకుండా పట్టుపడితే జరిమానా విధిస్తామన్నారు. కార్లు నడిపేటపుడు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. అనంతరం బ్రిడ్జి కూడలి నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు, అసిస్టెంట్ మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, లక్ష్మీభాయ్, 1వ పట్టణ ఎస్‌ఐ అంబేద్కర్, సిబ్బంది ఉన్నారు.


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్టీవో

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన పెంచుకోండి

సీతారామపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులకు కుష్టువ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఉదయ్‌కుమారి, ఎంపిహెచ్‌ఇవో మజీద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వప్న

● ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలి

● ఏఎస్ పేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు సురేష్‌బాబు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రషీద్, వైద్యఆరోగ్య, గ్రామ పెద్దతలు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

సంగం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశువైద్యాధికారి సురేష్ గురువారం స్థానిక పశు వైద్యశాలలో పశు ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు నట్టల నివారణ మందు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: పశు వైద్యశాల సహాయ సంచాలకులు తమ్మిశెట్టి శిల్ప సూచించారు. సీతారామపురం గ్రామ పంచాయతీలోని నారాయణంపేట, పోలంగారిపల్లి గ్రామాలలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలంగారిపల్లి సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఏహెచ్‌ఏ కొండయ్య, షంషుద్దీన్, మహేశ్వరి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంచినీటి పథకాల మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి వారి ప్రగతిని సభలో వినిపించారు. అనంతరం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి